ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ : 9440897445, 8074636674

మంగళవారం 06 అక్టోబర్ 2026 | Tuesday 06 octobar 2026 | హైదరాబాద్ Hyderabad | ➩ పేజీలు: 12+12 | ➩ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 171 | Vol.No 28 Issue No .171 | www.visionandhra.in

## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటాం
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
- ఫారమ్-6 మార్పులపై సుప్రీం వ్యాఖ్యలు
- సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
- కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
- వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం



హైదరాబాద్, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర): కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్–6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్–6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్–6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్–6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని మిగతా2లో..

## ఏడాదిన్నరలోగా రాష్ట్రంలో భూసర్వే పూర్తికి చర్యలు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2027 గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులు
- రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు శ్రీకారం




ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా సహచర మంత్రి జూపల్లి కృష్ణారావు , జిల్లా ఉన్నతాధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించి, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ సేవలపై సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా మొదట నిర్మల్ లో గోదావరి పుష్కరాలు 2027లో భాగంగా రహదారుల అభివృద్ధి కోసం రూ. 8.50 కోట్లతో బాసర బాతింగ్ ఘాట్, రూ. 4.65 కోట్లతో బిద్రెల్లి నుండి ధర్మాబాద్ రోడ్డు వరకు, రూ. 0.85 కోట్లతో బాసర బస్టాండ్ నుండి బాతింగ్ ఘాట్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశాము. అదేవిధంగా నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రంలో 20 లక్షల అంచనా వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనం, దస్తురాబాద్ మండలం గుడిసెరాలలో రూ. 20 లక్షలతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఆ తరువాత నిర్మల్‌లోని ఐడీఓసీ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల వారీగా రెవెన్యూ పరిపాలన, భూ సమస్యలు, రిజిస్ట్రేషన్ సేవలు, భూభారతి ద్వారా అందుతున్న సేవలు, పెండింగ్ దరఖాస్తులు, భూ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి సమగ్రంగా చర్చించాము. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్నాము. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన భూముల మిగతా2లో..

## ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే

- ప్రతిపక్షాల విమర్శలకు బీజేపీ చీఫ్ రామచందర్ రావు కౌంటర్
- నకిలీ, మృతుల ఓట్ల తొలగింపే లక్ష్యం
- ఓటమి చెందినప్పుడల్లా ఈసీ, ఈవీఎంలపై నిందలు: రామచందర్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు విమర్శించారు. ఈ ప్రక్రియను బీజేపీ చేపట్టలేదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆధ్వర్యంలో జరుగుతోందని స్పష్టం చేశారు. నకిలీ, చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, వలస వెళ్లిన వారి ఓట్లను సంబంధిత ప్రాంతాలకు బదిలీ చేయడం వంటి చర్యలు SIRలో భాగమని ఆయన పేర్కొన్నారు. సోమవారం మిగతా2లో..

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు

*ప్రత్యేక పాలసీ రూపకల్పనకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు*



హైదరాబాద్, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర): తెలంగాణను అంతర్జాతీయ స్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ మిగతా2లో..




## 9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

- హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం..
- ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక
- అక్టోబరు 9 లోగా డబ్బులు చెల్లించాలని ఆదేశం

హైదారాబాద్, అక్టోబర్ 05 : హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మిగతా2లో..

### వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు

## వేగవంతం చేయాలి

- ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష
- పెండింగ్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి: అధికారులకు ఆదేశం



సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగతా2లో..

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు

- జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిన జగన్
- ప్రాంతీయ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు
- ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్
- ప్రొద్దుటూరులో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- పాల్గొన్న డిప్యూటీ సిఎం జనసేన అధినేత పవన్ కల్యాణ్



ప్రొద్దుటూరు, అక్టోబర్ 05 : యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల మిగతా2లో..

## రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యం



- 90 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- హార్టికల్చర్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధే ఎజెండా
- ఆ దిశగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోంది
- ఉద్ఘాటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' ప్రారంభం
- రూ.30,156 కోట్లతో జలధార ప్రాజెక్టు నిర్మాణం

ప్రొద్దుటూరు, అక్టోబర్ 05 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ మిగతా2లో..

## మంత్రి లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ

*ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణం సాధించిన సురేఖను అభినందించిన లోకేశ్*



అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ మిగతా2లో..

## మేడిపల్లిలో "దొంగల రాజ్యం"..?

- చోరీలకు అడ్డాగా మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి..?
- దొంగలు 'ఆపరేషన్'లో.. పోలీసులు 'దర్యాప్తు'లో..!
- పోలీసులు రోడ్డుపైనే.. దొంగలు షట్టర్ల వెనుకనే..!
- ప్రధాన రహదారిపైనే రూ.2 కోట్ల చోరీ..!
- పోలీసుల గస్తీ ఎక్కడ.? నిఘాపై ప్రశ్నలు..!
- చోరీ తర్వాత హడావుడెందుకు..?!
- మేడిపల్లి పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు..!
- వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు.!









మేడ్చల్ జిల్లా/బోడుప్పల్, అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2026 సంవత్సరంలో అధికారికంగా నమోదైన పలు దొంగతనాలు పోలీసుల నిఘా వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్ పరిధిలో భద్రత డొల్లతనం తేటతెల్లమైంది. గతంలో రాచకొండ పోలీస్ కమిషనరేట్, నేటి మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ గా రూపాంతరం చెందినప్పటికీ ఈ పోలీస్ స్టేషన్ అసంధర్భంగా ఎప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. అసలు పోలీస్ స్టేషన్లో ఏం జరుగుతుంది?!. నిఘా వైఫల్యం ఎక్కడ ఉంది?. ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉన్నట్టా! లేనట్టా?. గతంలో పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది పై సైతం తీవ్ర అవినీతి ఆరోపణలు రావడం గతంలోనే మిగతా2లో..

### విజన్ ఆంధ్ర - ప్రత్యేక కథనం...

## లంచాల బాగోతానికి ఫుల్ స్టాప్ ఎక్కడ..?

- అవినీతి తిమింగలాల వలలో రాష్ట్రం!
- ఏసీబీ దాడులు చేసినా మారని అధికారుల తీరు
- అటెండర్ నుంచి జిల్లా అధికారి వరకు అంతా లంచాల మాయలోనే!
- రాష్ట్రంలో అవినీతి పాతర
- రంగారెడ్డి, మహబూబ్ నగర్, జిల్లాల్లో యథేచ్ఛగా లంచావతారం



*తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 05:* రాష్ట్రంలో అవినీతి అధికారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఏసీబీ అధికారులు రోజుకో చోట దాడులు చేసి పట్టుకుంటున్నా.. అధికారుల తీరులో మాత్రం ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఒకరోజు ఒక మిగతా2లో..

### పాఠశాలల్లో

## 4-స్టార్ సదుపాయాలు

- వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్పు
- 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడి
- ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష



అమరావతి, అక్టోబర్ 05 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా మిగతా2లో..

## మంత్రి లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ

అయింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకం సాధించిన ఆమెను మంత్రి లోకేశ్ ఘనంగా అభినందించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ, 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన తండ్రి సురేంద్ర కుమార్‌తో కలిసి జ్యోతి సురేఖ, మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా, జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026 ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్న జ్యోతి సురేఖను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం గర్వంగా ఉందని కొనియాడారు. ఏషియన్ గేమ్స్ చరిత్రలో జ్యోతి సురేఖ ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది. ఆమె నిలకడైన ప్రతిభ, పట్టుదల యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని లోకేశ్ అన్నారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.

## వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఇప్పటికే పూర్తయిన పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులపై శాఖల వారీగా సమీక్షించారు. మిగిలిన పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో నాణ్యత, వేగం, శాఖల మధ్య సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, చేపట్టిన పనులన్నీ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే

ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరిగిందని గుర్తుచేశారు. అప్పట్లో వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు విమర్శిస్తున్నారని ప్రశ్నించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ నేతలు SIRపై ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ఎన్నికల సంఘం లేదా ఈవీఎంలను తప్పుపట్టడం అలవాటుగా మారిందని రామచందర్ రావు విమర్శించారు. బీజేపీపై రాజకీయంగా ఎదుర్కోలేకే ᒍ×=పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, ᒍ×= ప్రక్రియలో అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడాలని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. ఓటర్ల పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ ప్రక్రియలు పారదర్శకంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో ᒍ×= ప్రక్రియ కొనసాగుతుండగా, అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు అక్టోబర్ 7 వరకు అవకాశం ఉంది. ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నారు.

## ఏడాదిన్నరలోగా రాష్ట్రంలో భూసర్వే పూర్తికి చర్యలు

సమగ్ర వివరాలను నమోదు చేసి, భూ హక్కులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాం. ప్రతి రెవెన్యూ గ్రామంలో భూ సర్వేను దశలవారీగా నిర్వహించి, ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) నంబర్ కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించాము. గిరిజనులు, గిరిజనేతరులు దశాబ్దాలుగా నివసిస్తున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులతో ఉన్న సమస్యలను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపాము. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న సుమారు 72 వేల నుంచి 73 వేల మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించాము. అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం మంజూరు చేయాలని అధికారులను ఆదేశించాము. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. భూ సంబంధిత సమస్యలు, రిజిస్ట్రేషన్ ఇబ్బందులు, పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. ప్రజాప్రభుత్వానికి చిత్తశుద్ధి, పారదర్శకత, నిజాయితీ ఉంది. రాబోయే సంవత్సన్నరలోపు రాష్ట్రంలో ఉన్న ప్రతి అంగుళం భూమిని సర్వే చేస్తాం. ప్రతి మనిషికి ఆధార్ ఎలా ఉందో ప్రతి భూమికి క్యూ ఆర్ కోడ్, మ్యాప్ తో కూడిన భూదార్ పాసుబుక్కులు అందిస్తాం. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే లు వెడ్మ బొజ్జ పటేల్ , రామారావు పటేల్ , అనిల్ జాదవ్ , కోవ లక్ష్మి , ల్యాండ్, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు డి.ఎస్. లోకేష్‌కుమార్ , రాజీవ్‌గాంధీ హనుమంతు , వి.పి. గౌతమ్ , ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!

మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం చేసింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు. అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు. అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040-24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు. కేటాయింపుదారులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపుతున్నట్లు వారు తెలిపారు.

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు

రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

**ఆరు అంతర్జాతీయ వర్సిటీల ఆసక్తి**

ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు. విదేశీ వర్సిటీలను ఆకర్షించేలా పాలసీని రూపొందించాలని ఆయన సూచించారు.

**అనుమతులు, మౌలిక వసతులకు ప్రాధాన్యం**

విదేశీ విశ్వవిద్యాలయాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, పెట్టుబడులకు అవకాశాలు, అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను ప్రత్యేక పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు ఆదేశించారు. ప్రతిపాదిత విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు.

**'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పై సమీక్ష**

సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' పురోగతిని కూడా సీఎస్ సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలు, 2028 జూన్ నాటికి 87 పాఠశాలల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

**ఒక్కో పాఠశాలకు 26 ఎకరాలు**

ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదులు తదితర సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలను పాటించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.

# మేడిపల్లిలో "దొంగల రాజ్యం"..?

సంచలనంగా మారింది. కానీ భద్రత పరివేక్షణలో మాత్రం డొల్లతనం అట్లనే ఉంది. జరుగుతున్నటువంటి సంఘటనలు అందుకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి అంటే అతిశయోక్తి కాదు!. పోలీస్ అంటేనే ప్రజలకు భద్రత, భరోసా, నమ్మకం. కానీ ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్నటువంటి అనేక సంఘటనలు ప్రజల్లో ఆ విధమైనటువంటి భద్రతను కల్పించలేకపోతున్నాయని విమర్శలు సైతం లేకపోలేదు. అనునిత్యం భద్రత అంశాలను, సమస్యాత్మక ప్రాంతాలు, అత్యంత కమర్షియల్ గా ఉన్నటువంటి అపార్ట్మెంట్లు, ప్రముఖుల నివాసాలు, ప్రదీప్ ప్రాంతాలు, వ్యాపార సముదాయాలు, కాలనీలో నిరంతర గస్తీ ఈ అంశాల్లో మేడిపల్లి పోలీసులు వైఫల్యం చెందారని విమర్శలు సైతం ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అనునిత్యం రెయిన్బోలు రద్దీగా ఉండే వరంగల్ ప్రధాన రహదారిపై సుమారు రూ.2 కోట్ల విలువైన వజ్రాలు, బంగారం చోరీ కావడం పరిస్థితి తీవ్రతను మరింత బయటపెట్టింది. ఎప్పుడూ రద్దీగా ఉండే వరంగల్ జాతీయ రహదారిపై, పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించే ప్రాంతంలోనే దుండగులు షట్టర్ తొలగించి భారీ చోరీకి పాల్పడటం సంచలనంగా మారింది. ఇంత భారీ చోరీ జరుగుతున్న సమయంలో పోలీసుల గస్తీ, నిఘా వ్యవస్థ ఏం చేస్తోందన్న ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది. తాజాగా రూ.2 కోట్ల భారీ చోరీ... ఇవన్నీ కలిపి చూస్తే మేడిపల్లి పోలీసుల నిఘా వ్యవస్థపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నేరాల నియంత్రణకు కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

***మేడిపల్లి ఠాణా పరిధిలో వరస చోరీలు... అయినా నిఘా ఎక్కడ?***

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2026లో అధికారికంగా నమోదైన దొంగతనాల సంఖ్యను పరిశీలిస్తే నేరాల నియంత్రణపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల నిఘా వైఫల్యాన్ని సైతం ఎత్తిచూపుతుంది. ఒక ఘటన తర్వాత మరో



ఘటన చోటుచేసుకుంటున్నప్పటికీ, చోరీలు జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు నిఘా ఏర్పాటు చేయడంలో పోలీసులు విఫలమయ్యారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

***గస్తీ పేరుకేనా? పెరుమాళ్ళకే ఎరుక..!!***

ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాలు, బంగారం-వజ్రాల దుకాణాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే పోలీసుల గస్తీ ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, అదే ప్రాంతాల్లో దొంగలు తమ పని తాము చేసుకుపోతుండటం పోలీసింగ్‌పై విమర్శలకు కారణమవుతోంది. కానీ అధికారుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు. అసలు మేడిపల్లి పోలీస్ స్టేషన్ కు ప్రతిరోజు వచ్చే ఫిర్యాదులు ఎన్ని?!, ఎఫ్ఐఆర్ నమోదైన సంఖ్య ఎంత?!. నెలల తరబడి దర్యాప్తు చేయడం ఇంకా ఆంతర్యం ఏమిటి?! అన్న ప్రశ్నలు సైతం ఉత్పన్నమవుతున్నాయంటే పోలీస్ విధులు ఏ విధంగా నిర్వహిస్తున్నారో అన్న సందేహాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

***రూ.2 కోట్ల చోరీతో మరోసారి బయటపడిన వైఫల్యం....***

తాజా భారీ చోరీ ఒక్క ఘటనగా చూడలేమని స్థానికులు అంటున్నారు. 2026లో నమోదైన వరుస దొంగతనాల నేపథ్యంలో చూస్తే,నేరాలను ముందుగానే అడ్డుకోవాల్సిన పోలీసుల నిఘా వ్యవస్థపై సమగ్ర సమీక్ష అవసరమని స్పష్టమవుతోంది. దొంగతనం జరిగిన తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం ఒక ప్రక్రియ. కానీ దొంగతనం జరగకుండా ముందస్తు నిఘా ఏర్పాటు చేయడమే అసలు పోలీసింగ్.ఈ విషయంలో మేడిపల్లి పోలీసుల పనితీరుపై ఇప్పుడు ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

***చోరీ తర్వాత దర్యాప్తే కాదు.. ముందస్తు నిఘా కూడా అవసరం..!!***

ముందస్తు నిఘా కూడా అవసరం. వరుస చోరీల నేపథ్యంలో నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయడం, సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పరిశీలించడం, అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచడం అత్యవసరం. ముఖ్యంగా బంగారం, వజ్రాల దుకాణాలు, వాణిజ్య సంస్థలు, గోదాములు ఉన్న ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక పర్యవేక్షణ అవసరం.

***నేరస్తుల కంటే ముందుండాల్సిన పోలీసులు.. వెనుకబడుతున్నారా?!***

వరుస చోరీలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు? గతంలో జరిగిన చోరీల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకున్నారు? ప్రధాన రహదారులపై సీసీ కెమెరాల పర్యవేక్షణ ఎంతవరకు ఉంది? రాత్రివేళల్లో గస్తీ ఏ విధంగా నిర్వహిస్తున్నారు? అనుమానాస్పద వ్యక్తులు,వాహనాలపై నిఘా ఉందా?ఈ ప్రశ్నలకు పోలీసు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తలపట్టుకుంటున్న పోలీసులు.. నిందితుల కోసం వేట

భారీ చోరీలతో పోలీసులపై ఒత్తిడి పెరుగుతోంది. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, పాత నేరస్తుల కదలికలు, ఇతర ప్రాంతాల్లో జరిగిన ఇలాంటి చోరీలతో సంబంధాలు వంటి అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

***ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి: ప్రజల డిమాండ్***

వరుస చోరీల నేపథ్యంలో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నేర నియంత్రణపై ఉన్నతాధికారులు ప్రత్యేక సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉంది. కీలక ప్రాంతాల్లో రాత్రి గస్తీని పెంచడంతో పాటు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, చోరీలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. ప్రజలు తమ ఆస్తులను కాపాడుకోవడానికి తలుపులు వేసుకోవడం మాత్రమే కాదు.. పోలీసులు కూడా నేరస్తులను అడ్డుకునేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని మేడిపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ అంశంలో మల్కాజ్ గిరి పోలీసు ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూద్దాం.!!.

## లంచాల బాగోతానికి ఫుల్ స్టాప్ ఎక్కడ..?

అధికారి ఏసీబీకి చిక్కితే, మరుసటి రోజు ఉదయమే మరో అధికారి బహిరంగంగా లంచం డిమాండ్ చేస్తున్నాడు. దీంతో ఏసీబీ పట్టుకున్నా ఏమీ కాదన్న ధీమా అధికారుల్లో పెరిగిపోయిందనే విమర్శ ప్రజల్లో గట్టిగా వినిపిస్తోంది. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా, మహబూబ్ నగర్ జిల్లాలలో అవినీతి పరాకాష్టకు చేరింది. ఏసీబీ తనిఖీల్లో పట్టుబడుతున్న కేసులను చూస్తేనే ఈ రెండు జిల్లాల్లో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అటెండర్ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు లంచం లేనిదే ఫైల్ కదలని పరిస్థితి నెలకొంది.

సోమవారం సంచలనం - లక్షతో చిక్కిన పెద్ద తలకాయ:

తాజాగా సోమవారం రోజు జరిగిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఒక జిల్లా స్థాయి అధికారి ఏకంగా లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది.

లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ చిక్కిన అవినీతి తిమింగలం!

ఎంబీబీఎస్ చదివి, లక్షల జీతం తీసుకుంటూ మళ్లీ లంచం ఏంటి..?

పట్టుబడ్డది ఎవరో కాదు.. ప్రస్తుత రంగారెడ్డి జిల్లా డీఎం ఓ హెచ్‌ఓ (ఇవీ ఓ నూ) స్వర్ణ కుమారి.. గతంలో వికారాబాద్ జిల్లా డీఎం ఓ హెచ్‌ఓగా పనిచేసిన ఆమె ఉన్నతమైన ఎంబీబీఎస్ చదువు చదివి, ప్రభుత్వం నుంచి లక్షల రూపాయల జీతం తీసుకుంటూ.. కూడా లంచాలకు కక్కుర్తి పడటం అత్యంత సిగ్గుచేటు అని ప్రజలు మండిపడుతున్నారు. వైద్యం దేవుడితో సమానం అంటారు.. కానీ ఇలాంటి అధికారుల తీరు వైద్య వృత్తికే మాయని మచ్చగా మారింది.

వెనుక రాజకీయ అండదండలేనా..?

అధికారులు ఇంత ధైర్యంగా లంచాలు అడగడానికి వెనుక రాజకీయ నాయకుల అండదండలు ఉండటమే కారణమనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. "ఏసీబీకి దొరికినా మా నాయకుడు కాపాడతాడు, ఏమీ కాదు" అనే ధీమాతోనే వారు రెచ్చిపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. లంచానికి అలవాటు పడ్డ అధికారులను కేవలం పట్టుకుని వదిలేయడం కాదు.. శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించి, కఠినంగా శిక్షించేలా చట్టాలను తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే ఈ లంచాల బాగోతానికి ఫుల్ స్టాప్ పడుతుందని సామాన్యుడి ఆవేదన.

ఇప్పుడు ఏసీబీ కన్ను నాగర్ కర్నూల్ పైన:

రంగారెడ్డి, మహబూబ్ నగర్ తో పాటు లినాగర్ కర్నూల్ జిల్లాలో కూడా అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ఏసీబీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లులి విశ్వసనీయ సమాచారం. త్వరలో అక్కడ కూడా భారీ దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాలు

రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు

రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యం

బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు. సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించా రు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపో యిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనిం చండి" అని అన్నారు."రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోదీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన ప్రజల ఉత్సాహాన్ని చూసి, వారికి ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతా కీ జై, తెలుగు తల్లికి జై" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు.

## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం.

ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

# సంపాదకీయం

## ప్రపంచాన్ని వదలని మహమ్మారులు!

ప్రపంచాన్ని మహమ్మారులు వదలట్లేదు. మొన్న కరోనా, నిన్న ఎబోలా.. నేడు మరోటి. ఇలా ప్రపంచాన్ని ఎదో ఒక వ్యాధితో అతలాకుతలం చేస్తున్నాయి. కరోనాతో ప్రపంచాని అతలాకుతలం చేసింది ప్రతీ ఒక్కరికి తెలిసిందే. ఇప్పటికీ ఆ పీడకలనుంఛి ఇకా కోలుకోలేదు. ఆ తరువాత ఎబోలా వ్యాధి కొన్ని దేశాలపై ముప్పేట దాడి చేసి అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఎనలేని దెబ్బకొట్టింది. ఇలాంటి విపత్తునుండి ప్రపంచం బయటపడక ముందే రష్యాలో మరో వింత వ్యాధి అక్కడి ప్రజలను భయపెడుతోంది. తాజాగా సైబీరియాలోని ఓ పరిశోధన కేంద్రంలో పనిచేసే ల్యాబ్? టెక్నీషియన్? తెలియని ఇన్ఫెక్షన్?తో మరణించడంతో, అధికారులు ముందు జాగ్రత్త చర్యగా వందల మందిని క్వారంటైన్?లో ఉ ంచారు. అమెరికా విదేశాంగ శాఖ ఈ వార్తపై స్పందించింది. ఈ ఇన్?ఫెక్షన్?/ వ్యాధి గురించి కచ్చితమైన సమాచారాన్ని వెంటనే విడుదల చేయాలని మాస్కోను కోరింది.అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఓ అధికారి మీడియాతో మాట్లాడుతూ, ఆగ్నేయ సైబీరియాలో వెలుగుచూసిన ఈ ఇన్?ఫెక్షన్ వ్యాధి గురించి తమకు సమాచారం ఉందని అన్నారు. ఈ పరిస్థితిని అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల(సీడీసీ)తో పాటు ఇతర సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ మాజీ అధికారి డాన్ హాఫ్?మెన్ మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని అమెరికా గూఢచార యంత్రాంగం సేకరిస్తున్నట్లు తెలిపారు. రష్యాలో అత్యంత ప్రమాదకర ప్లేగ్.. అవుట్ బ్రేక్ అయింది. భయానకంగా విస్తరిస్తోంది. ఓ మరణం సైతం సంభవించింది. వందలాదిమంది క్వారంటైన్ లోకి వెళ్లారు కూడా. ఈ సంఘటనతో ఉలిక్కిపడిందా దేశం. తక్షణ నివారణ చర్యలను తీసుకుంటోంది. అటు అమెరికా సైతం దీనిపై ఆరా తీస్తోంది. ప్లేగ్ అవుట్ వ్యాప్తి చెందిన ఉ దంతంపై రష్యాతో సంప్రదింపులు జరుతున్నామని, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటోన్నామని వైట్ హౌస్ వెల్లడించింది. సైబీరియాలో గల ఓ రహస్య ప్లేగ్ రీసెర్చ్ ల్యాబ్‌లో అనుకోకుండా చోటుచేసుకున్న ప్రమాదం వల్ల ప్లేగ్ అవుట్ బ్రేక్ అయినట్లు రష్యా చెబుతోంది. ఇర్కుట్స్క్ యాంటీ ప్లేగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తోన్న సైంటిస్ట్ డారియా షిపిలోవా దీని బారిన పడ్డారు. న్యుమోనియాతో హఠాత్తుగా మరణించారు. ఈ ల్యాబ్ నుంచి అత్యంత ప్రమాదకరమైన లైవ్ బ్యాక్టీరియా బయటకు వచ్చిందనే అనుమానాలతో వందలాది మందిని స్థానిక అధికారులు క్వారంటైన్‌లో ఉంచారు. ప్లేగ్ వ్యాప్తి చెందడానికి కారణం అయ్యే లైవ్ బ్యాక్టీరియా ఉన్న ల్యాబ్ టెస్ట్ ట్యూబ్‌ను ఆ సైంటిస్ట్ ప్రమాదవశాత్తూ పగలగొట్టినట్లు రీసెర్చ్ సెంటర్ ప్రాథమికంగా అంచనా వేసింది. మరణించడానికి కొద్ది గంటల ముందు ఈ విషయాన్ని డారియా స్వయంగా ఆసుపత్రి సిబ్బందికి వివరించినట్లు రష్యా మీడియా తెలిపింది. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న ఆమె.. టెస్ట్ ట్యూబ్ పగిలిన తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. రెండు రోజుల్లోనే మరణించారు. మంగోలియా సరిహద్దుకు ఆనుకుని ఉ ండే బురియాటియాలో ఉ ంటుందీ రీసెర్చ్ సెంటర్. దీంతో అటు మంగోలియా కూడా నివారణ చర్యలను తీసుకుంటోంది. ఆమె మరణం తరువాత రష్యా ప్రభుత్వం వేగంగా స్పందించింది. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను ప్రారంభించింది. డారియాకు ట్రీట్మెంట్ అందించిన ఆసుపత్రిలో దాదాపు 200 మందిని క్వారంటైన్ చేసింది. ఈ రీజియన్ లోని ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసింది. ఈ మరణానికి గల అసలు కారణం న్యుమోనిక్ ప్లేగ్ అని ప్రాథమికంగా నిర్ధారించిందక్కడి ప్రభుత్వం. ఎర్సినియా పెస్టిస్ అనే ప్రమాదకరమైన బ్యాక్టీరియా వల్ల ప్లేగ్ వ్యాధి సంభవించినట్లు తేల్చింది. మధ్య యుగంలో పలువురి ప్రాణాలను బలిగొన్న బ్లాక్ డెత్ మహమ్మారికి ఈ బ్యాక్టీరియానే కారణం. సాధారణంగా ప్లేగ్‌లో బుబోనిక్, న్యుమోనిక్, సెప్టిసిమిక్ అనే మూడు రూపాలు ఉంటాయి. వీటిలో శ్వాసకోశ వ్యవస్థపై నేరుగా దాడి చేసే న్యుమోనిక్ ప్లేగ్ అత్యంత వేగంగా వ్యాపిస్తుంది. జ్వరం, శ్వాస ఆడకపోవడం, దగ్గు వంటి ప్రాథమిక లక్షణాలు ఇందులో కనిపిస్తాయి. అదే ఇప్పుడు రష్యాలో అవుట్ బ్రేక్ అయినట్లు వార్తలొస్తోన్నాయి. ఈ నేపథ్యంలో మాస్కో హెల్త్ నిపుణులు రంగంలోకి దిగారు. శానిటేషన్ వింగ్ చీఫ్ డాక్టర్ అన్నా పోపోవా స్వయంగా ఉ న్నతాధికారులతో కలిసి సైబీరియా చేరుకుని ఈ ల్యాబ్ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి నియంత్రణలోనే ఉందని, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని కోరారు. సైబీరియాలోని యాంటీ–ప్లేగ్? పరిశోధన కేంద్రంలో ఇటీవల ఓ ప్రమాదం జరిగినట్లు సీఎన్ఎస్ వార్త సంస్థ నివేదించింది. ఆ తర్వాత అక్కడ పనిచేసిన ఒక ల్యాబరేటరీ టెక్నీషియన్? తెలియని ఇన్?ఫెక్షన్?తో మరణించారు. ఇర్కుట్స్క్? సమీపంలోని షెలెఖోవ్?లో ఉన్న యాంటీ–ప్లేగ్? రీసెర్చ్? ఇన్?స్టిట్యూట్?లో ఈ ఘటన జరిగిందని రష్యా ప్రభుత్వ వార్త సంస్థ టాస్ పేర్కొంది. మరోవైపు అంటువ్యాధుల పర్యవేక్షణ సంస్థ రోస్పోట్రెబ్నాడ్జోర్? దీనిపై కీలక విషయాలు వెల్లడించింది. సదరు ఉద్యోగి మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పేర్కొంది. అతనికి న్యుమోనియా లాంటి లక్షణాలు మాత్రం కనిపించాయని, అయితే ఆ వ్యాధి లేదా ఇన్?ఫెక్షన్ ఏమిటో ఇంకా నిర్ధరణ చేయాల్సి ఉందని పేర్కొంది. ఇర్కుట్స్క్? , షెలెఖోవ్? నగరాల్లో పారిశుద్ధ్యం లేక అంటువ్యాధులు బాగా ప్రబలుతున్నాయని రోస్పోట్రెబ్నాడ్జోర్? పేర్కొంది. ఏది ఏమైనప్పటికీ, ల్యాబ్? ఉద్యోగి మృతి కేసులో తాము ప్రత్యేక ప్రోటోకాల్?ను అమలు చేస్తున్నట్లు తెలిపింది. అయితే న్యూమోనిక్ ప్లేగ్? సంభవించి ఉ ండవచ్చనే ఆందోళనలు చెలరేగాయి. మరణించిన ల్యాబ్ టెక్నీషియన్? ఒక 28 ఏళ్ల మహిళ అని, ఆమె బహుశా ప్లేగ్? వ్యాధితో మరణించి ఉంటుందని బురియాటియా రిపబ్లిక్ నాయకుడు అలెక్సీ సిడెనోవ్? పేర్కొన్నారు. ప్లేగ్ వ్యాధి వ్యాపిస్తోందని వార్తల నేపథ్యంలో, ప్రధాన వైద్యాధికారులతో స్థానిక అంటువ్యాధుల నివారణ మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. ఆ తర్వాత ఇర్కుట్స్క్? గవర్నర్? ఇగోర్ కోబ్జెన్? మాట్లాడుతూ, ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని కోరారు. షెలెఖోవ్ పరిసర ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు.

# రోడ్లను పట్టించుకోని అధికారులు.. ప్రమాదాల అంచున ప్రజల ప్రయాణం



కాగజ్‌నగర్, అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం గ్రామంలో ప్రధాన రహదారుల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై ఉన్న గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారి ఎక్కడుందో, గుంత ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. రోడ్ల దుస్థితి కారణంగా వాహనాలు తరచూ దెబ్బతింటున్నాయని, అత్యవసర సమయాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. ప్రజల ఇబ్బందులు కళ్లకు కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో రహదారుల పరిస్థితిని పరిశీలించి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించకుండా ముందుగానే రోడ్లను పునరుద్ధరించి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని కోరుతున్నారు.

# వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన ర్యాలీ




సిర్పూర్ (టి) అక్టోబర్ (విజన్ ఆంధ్ర): వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా సిర్పూర్ (టి) మండల కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర) నుంచి అటవీ శాఖ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణ, అడవుల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ సంపదను కాపాడటంతో పాటు అడవుల్లోని వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి చెరుకు శ్రీనివాస్ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. వన్యప్రాణుల వేట, అక్రమ రవాణా వంటి చర్యలకు పాల్పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులు, గ్రామీణ ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ చెరుకు శ్రీనివాస్, డీఆర్వో తిరుపతి, సెక్షన్ ఆఫీసర్లు బాలాజీ, మోహన్ రావు, తులసీదాస్ నాయక్, అతారుద్దీన్, అక్తర్, రజిత, బీట్ ఆఫీసర్లు, వాచర్లు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి

## –జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





సంగారెడ్డి బ్యూరో,అక్టోబర్: 5(విజన్ ఆంధ్ర)ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత సమయంలో సత్వర పరిష్కారం చూపాలన్నారు. జిల్లా ప్రజావాణి దరఖాస్తులతో పాటు పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 81 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌కు 53, సంగారెడ్డి డివిజన్‌కు 22 , నారాయణఖేడ్ డివిజన్‌కు 5 , జహీరాబాద్ డివిజన్‌కు 1 వినతి అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని అధికారులు వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పీడీ గృహనిర్మాణ శాఖ చలపతిరావు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ఎస్.బి. రామాచారి, జిల్లా సంక్షేమాధికారిణి లలిత కుమారి, అదనపు డీఆర్డీఓ బాలరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**80 ఫీట్ల రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

**భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ విస్తరణ.. అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆలయ విస్తరణ, నిత్యాన్నదాన సత్రం, 80 ఫీట్ల రోడ్డు, బద్ది పోచమ్మ ఆలయం తదితర పనులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్అండ్‌బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనుల పురోగతిపై సమీక్షించారు.మంత్రి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని, ప్రస్తుతంతో పాటు భవిష్యత్‌లో పెరిగే భక్తుల రద్దీకి అనుగుణంగా వసతులు కల్పించాలని సూచించారు. ప్రతి పనికి నిర్దిష్ట గడువు నిర్ణయించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. 80 ఫీట్ల రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి చేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. అధికారులు పనులను తమ బాధ్యతగా భావించి పూర్తిస్థాయిలో నిమగ్నమై వేగంగా పూర్తి చేయాలని సూచించారు. భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ విస్తరణ పనులు చేపట్టాలని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులను ప్రతి వారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా శాఖల మధ్య సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, ఈఈ భీమ్లానాయక్, ఆలయ ఈఓ రమాదేవి, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎం. శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వీటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరూ స్మార్ట్ రేషన్ కార్డ్ తీసుకోవాలి : సంతోష్, మల్కాజిగిరి అధ్యక్షులు



మల్కాజిగిరి, అక్టోబర్ 5,(విజన్ ఆంధ్ర): అర్హులైన ప్రతి ఒక్కరూ డిజిటల్‌స్మార్ట్ రేషన్ కార్డ్ తీసుకోవాలనిమల్కాజిగిరి అధ్యక్షులు సంతోష్ కోరారు. సోమవారం నేరేడ్ మెట్ వివేకానందపురం కమిటీ హాల్ లో162, 175, 208, 157, రేషన్ షాపులకు సంబంధించిన రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,లబ్ధిదారులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా 50 శాతం స్మార్ట్ రేషన్ కార్డ్ లు పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఇది నిరంతరం కొనసాగుతోందని, డీలర్స్ అందుబాటులో ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి డీలర్ అడ్వైజర్ వెంకట హరి, డీలర్ శ్రీలత, కాలనీ వాసులు యాది,బాల తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమి పరిరక్షణకు కలెక్టర్ కు వినతి



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర:ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంచాల మండలంలోని కాగజ్‌ఘాట్ గ్రామ ఉ పసర్పంచ్ మైలారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.గ్రామంలోని సర్వే నంబర్ 22లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సెలవు దినాలు, అర్ధరాత్రి సమయాలను ఆసరాగా చేసుకుని నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఇప్పటికే సంబంధిత తహసీల్దార్ (ఎంఆర్ఓ), రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో ఇదే భూమిలో నిరుపేద కుటుంబాలకు 16 ఇంటి స్థలాలు కేటాయించి, వారికి పట్టాలు కూడా అందజేశారని గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం మిగిలి ఉన్న ప్రభుత్వ భూమిని కూడా అక్రమ నిర్మాణాలకు గురికాకుండా పరిరక్షించి, ఇల్లు లేని పేద ప్రజల అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.గ్రామస్తుల వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి, విషయాన్ని పరిశీలించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కందుకూరి నాగేష్, మైలారం నిర్మల, కొప్పు అండాలు, వంగల మమత, సయ్యద్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి అధికారుల సమన్వయం తో పని చేయాలి

## గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర అక్టోబర్ 5:–దేశంలోనే తొలిసారి.. జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే రాష్ట్ర గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. రామాయంపేట––సిద్దిపేట మధ్య జాతీయ రహదారి వెంట భారీ ప్లాంటేషన్ కార్యక్రమన్నీ ఈ నెల 6న ప్రారంభించనున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరు కానున్నారు. గవర్నర్ పర్యటనను విజయవంతం కోసం సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, మెదక్ ఎంపీ రఘునందన్ రావు లు ఈ నెల 6న మెదక్ జిల్లాలో పర్యటించనున్నారనీ, పర్యటనలో భాగంగా దేశంలోనే తొలిసారిగా జాతీయ రహదారి వెంట 35 వేల జీడిమామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామాయంపేటలో ప్రారంభించనున్నారని తెలిపారు.జాతీయ రహదారి వెంట ఒకేసారి ఇంత భారీ స్థాయిలో జీడిమామిడి మొక్కలు నాటడం దేశంలోనే ఇదే తొలిసారన్నారు.జాతీయ రహదారి వెంబడి అందుబాటులో ఉన్న భూమిని ఉత్పాదకంగా వినియోగించుకోవడంతో పాటు పచ్చదనాన్ని, పర్యావరణ సుస్థిరత. ప్రోత్సహించే లక్ష్యంతోభారతదేశంలో చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సాయంత్రం 3.30 గంటలకు రామాయంపేటలోని అమోఘ్ హోటల్ సమీపంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రారంభిస్తారు. సాయంత్రం 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.కలెక్టరేట్ లో నషా ముక్త్ భారత్ ర్యాలీ ప్రారంభంమెదక్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ మధ్యాహ్నం 2.30 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)కి చేరుకుంటారనీ,2.40 గంటలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించే నషా ముక్త్ భారత్ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. 2.50 గంటలకు ఐడీఓసీలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను సందర్శించి, స్వయం సహాయక సంఘాల సభ్యులతో భేటీ అవుతారు. అనంతరం నూతనంగా ఎన్నికైన భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారన్నారు.మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ నుంచి రామాయంపేటకు బయలుదేరి, 3.30 గంటలకు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారనీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గవర్నర్ పర్యటనను విజయవంతం కోసం పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సెక్యూరిటీ, ట్రాఫిక్ ,లాంటి పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశ అనంతరం ఐ డి వో సి లో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను. అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి ,డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా అటవీ అధికారి జో జి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, సంక్షేమ అధికారి హేమా భార్గవి,డి ఎస్ పి ప్రసన్న కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి



కాగజ్‌నగర్: అక్టోబర్ 5(విజన్ ఆంధ్ర) కాగజ్నగర్ పట్టణంలోని 24వ వార్డులో వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వార్డు 24లో గత కొన్ని నెలలుగా పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా చీకటి కారణంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లో బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సమస్య మరింత ఇబ్బందికరంగా మారుతుందని తెలిపారు. బతుకమ్మ వేడుకలకు మహిళలు రాత్రి వేళల్లో బయటకు రావాల్సి ఉంటుందని, వీధుల్లో సరైన వెలుతురు లేకపోవడంతో భద్రతపై ఆందోళన నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో 24వ వార్డు కాలనీ వాసులతో కలిసి కొండ తిరుపతి మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్యను వివరించారు. వెంటనే వార్డులో పాడైపోయిన వీధి దీపాలను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ వేడుకలకు ముందే వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తే మహిళలకు, కాలనీ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి రైతుల సహకారం అభినందనీయం

**తనగల రైతులకు ఎకరాకు రూ. 20 లక్షల పరిహారం**

**జిల్లా కలెక్టర్ ని, ఏఐసీసీ కార్యదర్శి ని సన్మానించిన తనగల గ్రామ రైతులు**




గద్వాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి వడ్డేపల్లి మండలం తనగల గ్రామ రైతుల సహకారం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు భూములు ఇస్తున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఐడిఓసి సమావేశ మందిరంలో తనగల గ్రామ రైతులతో సమావేశమై మాట్లాడారు. రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పై గత మూడు నెలలుగా తనగల గ్రామ రైతులతో పలుమార్లు సమావేశమై మాట్లాడటం జరిగిందన్నారు. కన్సల్ట్ అవార్డు కింద మొదట రూ.12 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలనుకున్నప్పటికీ రైతుల విజ్ఞప్తుల మేరకు ఇటీవలే రూ.16.50 లక్షల చొప్పున చెల్లించాలని మాట్లాడడం జరిగిందన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కు భూములు ఇస్తున్న అక్కడి రైతులకు ఇస్తున్న పరిహారం ప్రకారమే తనగల రైతులకు ప్రస్తుతం పరిహారం చెల్లిస్తూ ఉండడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు పరిహారంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, రిజర్వాయర్లో చేపల వేట హక్కులు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి సహకరిస్తున్న రైతులందరికీ జిల్లా అధికార యంత్రాంగం తరపున ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మాట్లాడుతూ ఆర్డీఎస్ కింద పూర్తిస్థాయిలో ఆలంపూర్ నియోజకవర్గ రైతుల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో తలపెట్టిన మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణం ఎంతో ప్రతిష్టాత్మకమైనదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనగల గ్రామ రైతులకు న్యాయం చేస్తూ పరిహారం పెంచడం జరిగిందన్నారు. అనంతరం తనగల గ్రామస్తులు కలెక్టర్, మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు రైతులను కలెక్టర్ అభినందిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, సర్వే ఏడి నూకరాజు, తనగల గ్రామ సర్పంచ్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యంలో కన్నతల్లికి నరకం ఆస్తి కోసం కుమార్తెల వేధింపులు!

**పక్షవాతంతో మంచానపడ్డ వృద్ధురాలి ఆవేదన**

**మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కలెక్టర్‌కు 'ప్రజావాణి'లో ఫిర్యాదు**

**సీనియర్ సిటిజన్ చట్టం కింద రక్షణ, జీవనభృతి కల్పించాలని వేడుకోలు**



హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర)వృద్ధాప్యంలో ఆసరాగా నిలిచి కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్నకూతుళ్లే ఆస్తి కోసం తనను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన తనపై ఏమాత్రం కనికరం లేకుండా ప్రవర్తిస్తున్న కుమార్తెలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.అర్జీలోని వివరాల ప్రకారం:హనుమకొండ జిల్లా, పరకాల మండలం, నాగారం గ్రామానికి చెందిన కొసిరి కళావతి (63) భర్త కొసిరి చంద్రయ్య 2019 ఆగస్టు 14న అనారోగ్యంతో మృతిచెందారు. వీరికి ముగ్గురు కుమార్తెలు (మేగ నిర్మల, కాశి లక్ష్మి, దిగవాల అరుణ), ఒక కుమారుడు (కొసిరి యుగంధర్) ఉన్నారు. భర్త బతికి ఉన్న సమయంలోనే పెద్దమనుషుల సమక్షంలో ముగ్గురు కుమార్తెలకు రావలసిన వాటా కింద నగదు, బంగారం రూపంలో పంపకాలు పూర్తి చేశారని తెలిపారు. అనంతరం కుటుంబ అప్పులతో పాటు మిగిలిన సర్వే నంబర్ 343/బి , 335/డి ల పరిధిలోని ఎ. 4.23 గుంటల భూమిని బాగోగులు చూసుకుంటున్న కుమారుడు యుగంధర్‌కు చెందాలని కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్ణయించినట్లు ఆమె పేర్కొన్నారు.ఆసుపత్రికి అని తీసుకెళ్లి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపణ:తన భర్త చంద్రయ్య మతిస్థిమితం కోల్పోయి, మరణశయ్యపై ఉన్న సమయంలోనే (ఆగస్టు 14, 2019న) చిన్న కుమార్తె అరుణ వైద్యం కోసం దవాఖానకు తీసుకెళ్తున్నామని చెప్పి మాయమాటలతో తీసుకెళ్లిందని కళావతి ఆరోపించారు. గుర్తుతెలియని వ్యక్తుల సాక్ష్యాలతో ఎ. 1.20 గుంటల భూమిని మోసపూరితంగా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుందని వాపోయారు. రెండేళ్ల తర్వాత ఈ మోసం వెలుగులోకి రావడంతో, సదరు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సివిల్ దావా (ఓ.ఎస్ నెం. 211/2021) దాఖలు చేశామని, ప్రస్తుతం ఆ కేసు విచారణలో ఉందని తెలిపారు.కోర్టు కేసులు నడుస్తుండగానే పట్టాదారు పాస్ పుస్తకం:ఆ తర్వాత కూడా ముగ్గురు కుమార్తెలు తల్లి బాగోగులు పట్టించుకోకపోగా, మిగిలిన భూమిపై కూడా హక్కుల కోసం కోర్టులో సివిల్ దావా (నెం. 32/2026) వేశారని చెప్పారు. మరోవైపు, వాస్తవాలను మరుగునపరిచి హైకోర్టులో తప్పుడు వివరాలతో రిట్ పిటిషన్ (నెం. 9222/2025) వేసి చిన్న కుమార్తె పట్టాదారు పాస్ పుస్తకం పొందిందని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు అప్పీల్ చేసినా, న్యాయస్థానం ఆదేశాల ప్రకారం విచారించి తగిన చర్యలు తీసుకోవడంలో స్థానిక రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.రైతుబంధు, పరిహారం అందక ఆర్థిక ఇబ్బందులు:ఈ వివాదాల కారణంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుబంధు నిలిచిపోయిందని, అంతేగాకుండా సీసీఐ వారు భూమి సేకరించినప్పటికీ రావాల్సిన నష్టపరిహారం కూడా అందకుండా పోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రోదించారు. ప్రస్తుతం పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమైన తనను కుమారుడు యుగంధర్, కోడలు స్వాతి మాత్రమే కంటికి రెప్పలా చూసుకుంటున్నారని.. కుమార్తెలు మాత్రం ఏమాత్రం మానవత్వం లేకుండా వేధిస్తున్నారని వాపోయారు.కలెక్టర్‌కు వేడుకోలు:మోసపూరితంగా పొందిన ఎ. 1.20 గుంటల పట్టాదారు పాస్ పుస్తకాన్ని వెంటనే రద్దు చేయాలని, మిగిలిన ఎ. 3.03 గుంటల భూమిని తన పేరిట మ్యుటేషన్ చేసి పాస్ పుస్తకం ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. అలాగే సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ చట్టం కింద తనకు కుమార్తెల నుంచి జీవనభృతి ఇప్పించి, మానసిక క్షోభకు గురిచేస్తున్న వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని బాధితురాలు ప్రార్థించారు.బాధితురాలి వివరాలు: పేరు: కొసిరి కళావతి (భర్త: దివంగత కొసిరి చంద్రయ్య) చిరునామా: ఇంటి నెం. 6-129, నాగారం గ్రామం, పరకాల మండలం, హనుమకొండ జిల్లా సంప్రదించాల్సిన నంబర్: 8522049950

## బెంగళూరులో జరిగిన బాడీ బిల్డర్ పోటీలలో అయిజ ప్రభాకర్ కి టైటిల్




అయిజ అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన ఆర్ ఎస్ జిమ్ నిర్వాహకులు సర్టిఫైడ్ ట్రైనర్ ప్రభాకర్ కు ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు. ఆదివారం బెంగుళూరులో వాలార్ క్లాసిక్ 2026టు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగం ఫిజిక్స్ నందు టైటిల్ విన్నర్ సాధించారు బెంగళూరులోని బి.ఆర్.ఎస్ ఆడిటోరియం నందు జరిగిన ఈ పోటీలలో వివిధ రాష్ట్రాలకు చెందిన బాడీ బిల్డర్లు పాల్గొన్నారు . ఇందులో ప్రభాకర్ టైటిల్ విన్నర్ సాధించారు పథకాలను వాలర్ క్లాసిక్ ఫౌండర్ ఒలంపియా వరల్డ్ మెన్సు ఫిజిక్స్ టైటిల్ విన్నర్ హర్భజన్ , ప్రొఫెషనల్ ట్రైనర్ యాదవ్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. మొదటిసారిగా అయిజ కు రావడం గర్వకారణం గా ఉందని అయిజ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## అగ్ని ప్రమాదానికి ఆహుతై జీవనోపాధి కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకున్న

**ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్**



అయిజ అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామంలో అక్టోబర్ 3న షాట్ సర్క్యూట్ ద్వారా అగ్ని ప్రమాదంకి పూర్తిగా ధ్వంసమై జీవనోపాధి కోల్పోయిన కుమ్మరి వెంకట్రాములు -కుమ్మరి ఈరమ్మ కుటుంబ సభ్యుల గురించి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి. డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ వెంటనే స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకొని తక్షణ సహాయం కింద 20,000 వేల రూపాయలు అందజేయడం జరిగింది.భవిష్యత్ లో కూడా ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని తెలియజేశారు మాజీ శాసనసభ్యులు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేశ్వరి సుధాకర్ గౌడ్, అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప,వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్, మేడికొండ లక్ష్మీ కాంతారావు,మాజీ ఎంపీపీ ప్రకాష్ గౌడ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ సంకపురం రాముడు, జానయ్య, రంగు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డిని గెలిపించాలి**

**డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి,**



ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు యూనియన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీ జి ఎస్ ఆర్ టీ సి డిపో వద్ద ఘనంగా ప్రచార సభ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన ఐ ఎన్ టి యు సి, ఎస్ డబ్ల్యూ యు, టీ ఎం యు, ఎస్ డబ్ల్యూ ఎఫ్,కూటమి) అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి తరఫున నిర్వహించిన ఈ ప్రచార సభలో డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ , బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లు కంది శ్రీనివాస్ రెడ్డి, గజేందర్ లతో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డి సి సి అధ్యక్షుడు నరేశ్ జాదవ్ లు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి, డి సి సి అధ్యక్షుడు నరేశ్ జాదవ్ లు మాట్లాడుతూ... గత పదేళ్ల పాలనలో రాత్రింబగళ్లు కష్టపడి పనిచేసే ఆర్టీసీ కార్మికులు సమయానికి వేతనాలు అందక అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రతినెల 1వ తేదీనే ఉద్యోగులు, కార్మికులకు జీతాలు చెల్లిస్తూ వారి సంక్షేమానికి పూర్తి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలలో మెజారిటీ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని, విలీనంతో పాటు మిగిలిన డిమాండ్లను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంస్థ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డి 'బాణం' గుర్తుకు భారీ మెజార్టీతో గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ ప్రచార సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్, బోథ్ మార్కెట్ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, , ఆత్మ కమిటీ చైర్మన్లు గిమ్మ సంతోష్, రాజు యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కిజార్ పాషా, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్, ఎన్ టీ యు సి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్, అలాగే బండి దేవిదాస్ చారి, బెజ్జంకి అనిల్ కుమార్, గౌలి సంజీవ్ కుమార్, కృష్ణారెడ్డి తదితర నాయకులు, కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీ




హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర)మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో రోబోటిక్ టెక్నాలజీతో కొత్త ముందడుగు సర్జన్ నైపుణ్యానికి ఆధునిక రోబోటిక్ సాంకేతికతను జోడించి ప్రతి రోగికి వ్యక్తిగతికరించిన మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స మార్పిడి చేయడం జరుగుతుందని ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స ఆర్థోస్కోపి ట్రామా నిపుణులు డాక్టర్ అభిషేక్ బర్లి అన్నారు. సోమవారం హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆధునిక జాయింట్ రీప్లేస్మెంట్ సర్జరీలో ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది సర్జన్ అనుభవం క్లినికల్ కంప్యూటర్ ప్లానింగ్ రొబెటిక్ టెక్నాలజీ ఉపయోగించడం ద్వారా ప్రతి రోగి మోకాలికి అనుగుణంగా శస్త్ర చికిత్సను మరింత వ్యక్తిగతికరించవచ్చు అని తెలిపారు. యశోద హాస్పిటల్ సోమాజిగూడ రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలో 15 సంవత్సరాలు పైగా అనుభవం కలిగి ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత యువతిపై అఘాయిత్యం ఖండించిన పసునూరి మురళి

**-ఇంకెన్నాళ్లు ఈ దాడులు..? దళిత మహిళలకు రక్షణ ఏదీ? -దళిత--బహుజన, మహిళా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలి. -ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి.**

వరంగల్ జిల్లాప్రతినిధి అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర);-వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఓ దళిత యువతిపై మానభంగం జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న,అఘాయిత్యాన్ని ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి తీవ్రంగా ఖండించారు. పెళ్లిచేసుకుంటానని నమ్మించి మోసం చేయడం, శారీరకంగా వాడుకుని గర్భం దాల్చిన అనంతరం అబార్షన్ చేయించారనే ఆరోపణలు అత్యంత ఆందోళనకరమని అన్నారు. మరోమారు అబార్శన్ అయిన తరువాత బాధితురాలు పెళ్లి చేసుకోవాలని కోరిన సమయంలో బెదిరింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువత్తగా వాటిపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు.

**అధికారం ఉందని దౌర్జన్యమా?**

బాధితురాలి ఆరోపణల నేపథ్యంలో సంబంధిత మున్సిపల్ చైర్మన్ సారంగపాణి కొడుకు శ్రీకాంత్ అనే వ్యక్తికి రాజకీయ, అధికార పలుకుబడి ఉందనే ప్రచారం జరుగుతోందని మురళి అన్నారు. బాధితురాలు ప్రజాప్రతినిధులను ఆశ్రయించినప్పటికీ తగిన స్పందన లభించలేదనే ఆరోపణలు వస్తున్నాయని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.రాజకీయ సంబంధాలు, పదవులు, పలుకుబడి ఏవైనా చట్టం ముందు అందరూ సమానమేనని స్పష్టం చేశారు. బాధితురాలి ఫిర్యాదును పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆమెకు న్యాయం జరిగేలా పోలీసు, రెవెన్యూ, మహిళా సంక్షేమ శాఖ అధికారులు దళిత, ప్రతి మహిళా సంక్షేమ సంఘాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మరెప్పుడో దళిత మహిళలపై దాడులు ఆగేది ?**

దళిత మహిళలపై వేధింపులు, దాడులు, వివక్షకు సంబంధించిన ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నా బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం అందకపోవడం ఆందోళన కలిగిస్తోందని మురళి అన్నారు. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ వాటి అమలులో ఎలాంటి లోపాలు ఉండకూడదని, బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేసే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు.

**బాధితురాలికి అండగా నిలవాలి**

బాధితురాలిపై సామాజిక ఒత్తిడి తీసుకురావడం, రాజీ పేరుతో కేసును నీరుగార్చడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడకూడదని అన్నారు. దళిత--బహుజన సంఘాలు, మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు, అఖిలపక్ష నాయకులు బాధితురాలికి అండగా నిలిచి న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.లి"బాధితురాలికి న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. దళిత మహిళలపై మరోసారి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడాలంటే భయపడే విధంగా చట్టపరమైన చర్యలు ఉండాలి. రాజకీయ పలుకుబడి ఉన్నా, పదవిలో ఉన్నా చట్టానికి ఎవరూ అతీతులు కారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలి"లి అని పసునూరి మురళి డిమాండ్ చేశారు. దళిత మహిళల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు.



## ఎంపీ డీకే అరుణమ్మ చొరవతో రాజోలి కి నూతన క్రీడా ప్రాంగణం

### ఎంపీ కి కృతజ్ఞతలు తెలిపిన రాజోలి గ్రామస్తులు



రాజోలి అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రానికి క్రీడా ప్రాంగణం కావాలని జిల్లా ఉపాధ్యక్షుడు సంఘాల సంజీవరెడ్డి , రాజోలి గ్రామ ఉపసర్పంచ్ సంధ్య శ్రీరామ్ రెడ్డి పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణమ్మ ని లెటర్ ఇవ్వాలని కోరడం జరిగింది. అందుకు స్పందించిన ఎంపీ.డీకే అరుణమ్మ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్నటువంటి 10 ఎకరాల ల్యాండ్ ని సాధన చేసి ఇవ్వాలని గట్టు మండల కేంద్రంలో ఉన్నటువంటి మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ సంబంధించినటువంటి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వినోదు ని ఆదేశించారు. ఇట్టి విషయంపై స్పందించి వెంటనే ఈ నెల 10వ తేదీ నుంచి పనులు ప్రారంభిస్తామని వారు స్పష్టమైన హామీ ఇచ్చారు. 10వ తేదీ నుంచి దానికి సంబంధించినటువంటి చదును చేసి అక్కడ ప్లే గ్రౌండ్ పూర్తిగా ఏర్పాటు చేస్తామని వారు తెల్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్ రామచంద్ర రెడ్డి, గద్వాల్ 2023 కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి బలిగర్ శివారెడ్డి, రాజోలి మండల అధ్యక్షుడు కనీకే శశికుమార్, సీనియర్ నాయకుడు ఈసీ ఆంజనేయులు, మండల నాయకులు కొంకతి రాము, బసోది అంజి, తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 9న జాబ్ మేళాపెద్దపల్లి ప్రాంతంలోనే ఉద్యోగాలు.. నిరుద్యోగులకు చాన్స్

### –జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్–05(విజన్ ఆంధ్ర)జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. పెద్దకల్వలలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) మొదటి అంతస్తు రూమ్ నంబర్ 233లో ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.కే కే ఎంటర్ప్రైజెస్‌లో మొత్తం 40 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సోలార్ ఫిట్టింగ్ టెక్నీషియన్ పోస్టులు 10, సేల్స్ ఎగ్జిక్యూటివ్/సేల్స్ ఆఫీసర్ పోస్టులు 30 ఉన్నాయని వివరించారు. సోలార్ ఫిట్టింగ్ టెక్నీషియన్ పోస్టులకు మెకానికల్/ఎలక్ట్రికల్ అర్హత కలిగిన పురుషులు, సేల్స్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ విద్యార్హతలున్న పురుషులు, మహిళలు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి వరుసగా రూ.15 వేలు, రూ.20 వేల నెలవారీ వేతనం అందుతుందని పేర్కొన్నారు.అర్హులు అప్‌డేటెడ్ సీవీ, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్, ఆధార్ జిరాక్స్, అనుభవ ధ్రువపత్రం (ఉంటే)తో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8985336347, 8121252443 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## 14వ వార్డులో నీటి ఎద్దడి నివారణకు త్వరలో శాశ్వత పరిష్కారం



ఊట్కూర్, అక్టోబర్ 5 ( విజన్ ఆంధ్ర) ఊట్కూర్ మండల కేంద్రంలోని 14వ వార్డు పాతపేటలో నెలకొన్న నీటి ఎద్దడిని త్వరలో నివారించేందుకు చర్యలు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్, ఉప సర్పంచ్ రమేష్ అన్నారు. సోమవారం ఊట్కూర్ మండల కేంద్రంలోని 14వ వార్డు పాతపేటలో అధికారులు, నాయకులు పర్యటించి స్థానికుల నుంచి తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో నీటి సరఫరా పరిస్థితి, బోర్లు, పైప్‌లైన్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంతో పాటు ప్రస్తుతం కూడా పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పాతపేటలో నీటి సమస్యను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో నీటి వనరులను పరిశీలించి, పైప్‌లైన్ మరమ్మతులు, బోర్లకు సంబంధించిన సమస్యలను మినీ ట్యాంకర్ ఏర్పాటు చేసి పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరంగా తాగునీరు అందేలా సంబంధిత శాఖల సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.స్థానికంగా ఉన్న నీటి సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి ప్రజలు సహకరించాలని కోరారు. వార్డులో నీటి ఎద్దడి నివారణకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, వార్డు సభ్యురాలు సువర్ణ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

### వసతి గృహాల నిర్వహణలో ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 06 (విజన్ ఆంధ్ర):ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి దరఖాస్తుకు పరిష్కార మార్గం చూపే విధంగా ప్రత్యేక అధికారులు సంబంధిత విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ , వెనుకబడిన తరగతులు, మైనారిటీ, తదితర అన్ని సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో ప్రత్యేక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉదయం బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, స్నాక్స్, తదితర అన్ని సౌకర్యాలు నాణ్యమైన రుచికరమైన డైట్ మెనూ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, హెల్త్ శానిటేషన్, న్యూట్రీషియన్, ఎడ్యుకేషన్ లపై పిల్లల్లో ఆసక్తి అవగాహన వచ్చే విధంగా తరగతులు నిర్వహించాలని సూచించారు. ఏలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతిరోజు డైట్ మెనూకు సంబంధించి ఫోటోలు సంబంధిత వాట్సప్ గ్రూపులలో పోస్ట్ చేయాలని సూచించారు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిత్యవసర వస్తువులను సరఫరా చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రులు ప్రభుత్వ ఎన్నికల సంఘం సూచించిన ప్రకారం తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ముందుగా అధికారులు సిబ్బంది తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని విభాగాల ఉద్యోగులు ముఖచిత్ర హాజరు ఆన్లైన్ ద్వారా నిర్వహించే మీ ప్రమాణం యాప్ లో నమోదు చేసుకొని ముఖ చిత్ర హాజరులు వేయాలని కలెక్టర్ తెలిపారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్న వారు వివరాలు,ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన గుండాల మంగమ్మ వారి బందువుల యొక్క పట్టాదారు పాసుపుస్తకాలు గత వేసవిలోని విపరీతమైన ఎండలకు తమ గుడెసెలకు ప్రమాదవశాత్తుగా అంటుకున్న మంటలలో కాలిపోయాయని ఇదే అదనుగా వేరే వ్యక్తులు తమ పేరు మీద ఉన్న భూమిని వారిపై పట్టా చేసుకున్నారని అట్టి వారి పేర్ల మీద ఉన్న తమ భూమిని రద్దు చేసి తమ పేర్ల మీద పట్టా పాసు పుస్తకాలు ఇప్పించాలని కోరారు.కేసముద్రం మండలం భూక్యారాం తండాకు చెందిన రమేష్ తమకు కేటాయించిన ఇంటి స్థలంలో కట్టుకున్న ఇంటికి ఇంటి నెంబర్ ను కేటాయించాలని కోరారు.గూడూరు మండలం మాట్వాడ కు చెందిన తోలెం సౌజన్య ఒంటరి మహిళ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకొని చాలా రోజులు అవుతుందని తనకు ఒంటరి మహిళ పెన్షన్ ఇప్పించాలని కోరారు.జిల్లావ్యాప్తంగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలాల వారిగా 110, డివిజనల్ స్థాయి లో 9, జిల్లా కేంద్రంలో 146, దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు, అట్టి దరఖాస్తుల పరిష్కారం నిమిత్తం కొన్ని తక్షణమే పరిష్కరించి, మరికొన్ని సంబంధిత విభాగాల వారికి సిఫారసు చేయడం జరిగిందని అన్నారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, అన్ని విభాగాల సంబంధిత అధికారులు. కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలపాలి

### పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 5(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా గాంధారి మండలం లోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశంలో పాఠశాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా స్థాయి పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సూచించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు.తదుపరి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

### ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ పనిచేస్తోంది

### ప్రజావాణిలో 18 మంది ఫిర్యాదులను నేరుగా స్వీకరించిన

### జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



గద్వాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో) ఫిర్యాదులపై తక్షణ చర్యలు,నిష్పక్షపాత విచారణతో బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ టీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు నమ్మకమైన వేదికగా మారుతోంది. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా ఎస్పీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 18 మంది ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నమ్మకమే పోలీస్ శాఖకు బలమని పేర్కొంటూ, సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు.స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.ఈ సోమవారం ప్రజావాణిలో భూ వివాదాలు -- 05, వ్యక్తిగత గొడవలు -- 02, భర్త వేధింపులు -- 02, కుటుంబ తగాదాలు -- 03, చీటింగ్ -- 03, ఇతర సమస్యలు -- 03 ఫిర్యాదులు వచ్చాయి.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పురోగతిని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రతి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

## తక్కువ నీటితో పూల సాగు రైతులకు మేలు

### –పండుగలు..పెళ్లిళ్లతో పూలకు పెరగనున్న డిమాండ్

### –పూల పంటలకు ఎకరానికి రూ.8 వేల వరకు రాయితీ

### –జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్‌ప్రసాద్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్–05(విజన్ ఆంధ్ర)ఎల్‌నినో పరిస్థితులు, వరుసగా రానున్న పండుగలు, వివాహాల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పూల పంటల వైపు దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్‌ప్రసాద్ సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలను సాగు చేస్తే నీటి పొదుపుతో పాటు మంచి ఆదాయం పొందవచ్చన్నారు.జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామానికి చెందిన రైతు కుంట రాజిరెడ్డి సాగు చేస్తున్న రెండెకరాల బంతి తోటను సోమవారం ఆయన పరిశీలించారు. సాగు విధానం, నీటి వినియోగం, పంట పరిస్థితిని తెలుసుకున్నారు. దసరా, దీపావళి, అయ్యప్ప పూజలు, సంక్రాంతితో పాటు మే--జూన్ వరకు కొనసాగే వివాహాల సీజన్‌లో బంతి, చామంతి, గులాబీ, మల్లె పూలకు డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. విడతలవారీగా పూలను కోసి మార్కెట్‌కు తరలించడం ద్వారా రైతులకు నిరంతర ఆదాయం లభిస్తుందని తెలిపారు.బంతి, చామంతి, గులాబీ, మల్లె తదితర పూల సాగుకు ఎకరానికి రూ.8 వేల వరకు ఉద్యానశాఖ రాయితీ అందిస్తోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు కూడా ప్రభుత్వ సబ్సిడీ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులు సాగు ప్రణాళిక, విత్తన రకాలు, నాటే సమయం, నీటి యాజమాన్యం, పురుగు--తెగుళ్ల నివారణ, మార్కెటింగ్‌పై ఉద్యాన అధికారులను సంప్రదించి శాస్త్రీయ పద్ధతుల్లో పూల సాగు చేపట్టాలని సూచించారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత



మాగనూరు, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించిన రెండు ఇసుక టిప్పర్లను కృష్ణ మండలం కున్సి సమీపంలో టాస్క్ ఫోర్స్ , కృష్ణ పోలీసులు టీఎస్ 08 యు బి 5587 నంబర్ గల ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ వాహనాన్ని నడుపుతున్న శ్రీరాములు, తండ్రి వెంకటప్ప, వడ్వాట్ గ్రామం, మాగనూర్ మండలం కాగా, వాహన యజమాని వెంకటేష్, గూడెబల్లూర్గా గుర్తించారు.అదే విధంగా కున్సి ప్రాంతంలో కే ఏ 32 ఏబి 5081 నంబర్ గల మరో ఇసుక టిప్పర్‌ను కూడా పోలీసులు పట్టుకున్నారు. ఈ వాహనం డ్రైవర్ గురునాథ్, తండ్రి శెట్టి రాథోడ్, చించోళి, కలబురగి కాగా, యజమాని శ్రీకాంత్ రాథోడ్, చించోళి, కలబురగిగా గుర్తించారు.ఈ రెండు ఘటనలకు సంబంధించి డ్రైవర్లు, వాహన యజమానులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణ ఎస్సై ఎస్.ఎం. నవీద్ తెలిపారు.అక్రమ ఇసుక రవాణా, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్ ఎం నవీద్ హెచ్చరించారు.

## ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి చర్యలు

హైదరాబాద్, అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర) : ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నేషనల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రమేష్ అన్నారు. సోమవారం ట్రస్మా, భారతి ఎయిర్‌టెల్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'టీచర్స్ అప్రిసియేషన్ అవార్డ్స్–2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ది టీచర్ యాప్ ద్వారా సీపీడీలో ప్రతిభ కనబరిచిన 30 మంది ఉ పాధ్యాయులను సత్కరించారు. అవసరమైతే ప్రైవేట్ పాఠశాలల ఉ పాధ్యాయులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. ట్రస్మా అధ్యక్షుడు సదుల మధుసూదన్, ఎన్.రమేష్ రావు, పి.రాఘవేంద్ర రెడ్డి ఉపాధ్యాయులు సాంకేతికత, ఏఐ, ఆధునిక బోధనా పద్ధతులపై నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. ఏఐ రీసోర్స్ యూసేజ్ టాప్–10లో జి.శైలజ, వివన్ సాగర్, నీలిమ, సంగీత, వరలక్ష్మి, వాణి, ప్రవిలిక, షాహీన్ బేగం, మౌనిక, ప్రశాంతి నిలిచారు. సోమిరెడ్డి, ప్రణీత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రమేష్ రావు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ శాంతి పురస్కారాలకు 20 మంది ఎంపిక



హైదరాబాద్, అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర): అంతర్జాతీయ అహింస దినోత్సవం ముగింపు ఉత్సవాల సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న ఉదయం 10 గంటలకు అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ శాంతి పురస్కారాలు–2026ను డా.టి.అంజనీ దేవి, డా.దీపిక, మడిగల విజయభాస్కర్ రెడ్డి, గాజుల అంజయ్య, డా.ఎం.సంగీతారెడ్డి, డా.రవితేజ, డా.ఎం.రాజ్‌కుమార్, డా.పి.అశ్విని రెడ్డి, ఎస్.మధుసూదన్, పి.సుందర్, తరుణ్ కుమార్ మెహతా, ఎడ్ల బాలరాజ్, కుంబర్తి రవీందర్, ఎం.కిరణ్ మై, మిత్ర జాన్ బునియన్, మహమ్మద్ సాహెబ్ రూమి, కె.జోజి రెడ్డి, కె.ప్రపూర్ణ రెడ్డి, జమీల్ రబ్బానిలకు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.వి.బాలకృష్ణ రెడ్డి, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొ.సూర్య ధనుంజయ్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ వామన్ రావు, లయన్ ప్రేమ్ చంద్ జైన్, మేజర్ కె.ఎ.శివప్రసాద్ తదితరులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

## జ్యువలరీ షాపును ప్రారంభించిన షబ్బీర్ అలీ



కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 5 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా కేంద్రంలో మదీనా మాజిద్ దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన మహమ్మద్ జ్యువలర్స్ షావును రాష్ట్రా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాన్, కౌన్సిలర్లు షేరు, లడ్డు, అన్వార్, సత్యం, అంజాద్, జావీద్, యూనుస్, సిద్దిక్, చిట్టిబాబు, మజీద్, వాజీద్, గంగాధర్, గణేష్, హరూన్, హఫీజ్ లయీక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌లో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి ఆహ్వానం



ఆసిఫాబాద్: అక్టోబర్ 5(విజన్ ఆంధ్ర) కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తేదీల్లో 9వ సబ్–జూనియర్, జూనియర్ బాలికల రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2026–27 నిర్వహించనున్నట్లు కేబీ ఆసిఫాబాద్ నెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్‌లో జరిగే ఈ పోటీలకు గౌరవ ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు శ్రీమతి కోవ లక్ష్మిని ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారిణులు ఆవిష్కరించారు. గాంచీూ ఆధ్వర్యంలో కేబీ ఆసిఫాబాద్ నెట్‌బాల్ అసోసియేషన్ ఈ పోటీలను నిర్వహించనుంది. సబ్–జూనియర్ గర్ల్స్, జూనియర్ గర్ల్స్ విభాగాల్లో జరిగే పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జట్లు పాల్గొననున్నాయి. పోటీలకు హాజరయ్యే క్రీడాకారిణులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లాలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలు నిర్వహించడం ద్వారా క్రీడాకారిణుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రీడా స్ఫూర్తిని మరింత పెంపొందించేందుకు అవకాశం కలుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీ భాయ్, ఖేలో ఇండియా కోచ్, నెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారిణులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పనులకు గడువు మించొద్దు

## -పెండింగ్ నోటీసులు, విచారణలను పండుగలోపే పూర్తి చేయాలని ఆదేశం
## -ఎక్కువ తొలగింపులు,చేర్పులున్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
## -ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి.బాల మాయాదేవి

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-05(విజన్ ఆంధ్ర)ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణలను పండుగలోపే పూర్తి చేసి, నిర్దేశిత కాలపట్టికను కచ్చితంగా పాటించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రక్రియను అధికారులు సమర్థంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. రికార్డులన్నింటినీ రీకన్సైల్ చేయాలని, ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని ఎస్ఓపీ ప్రకారం పరిశీలించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో ఓటర్ల తొలగింపులు, చేర్పులు నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేకంగా పరిశీలించాలని, రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించి మినిట్స్‌ను భద్రపరచాలని ఆదేశించారు. ఈ నెల చివరి వారంలో మరోసారి జిల్లాను సందర్శించి పనుల పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌లో గుర్తించిన అనామలీలు, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి అవసరమైన పత్రాలను సేకరిస్తున్నామని తెలిపారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి పత్రాలు సేకరిస్తున్నారని, అర్హత ఉన్న ఓటర్లకు అవసరమైన ప్రత్యామ్నాయ పత్రాలను సమర్పించేందుకు సహకరిస్తున్నామని చెప్పారు. అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులైన యువత నుంచి ఫారం-6 దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మున్సిపల్ ప్రాంతాల్లో వార్డు అధికారులు, ఇతర సిబ్బంది బీఎల్ఓలకు సహకరిస్తున్నారని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు గంగయ్య, సురేష్, సంబంధిత ఎన్నికల అధికారులు, తహసీల్దార్లు, బీఎల్ఓలు, మున్సిపల్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధుల అనుభవాలు యువతరానికి మార్గదర్శనం

## ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం
## పలు రంగాల్లో విశేష కృషి చేసిన వయోవృద్ధులను సన్మానించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)సమాజంలోని వివిధ పరిస్థితులపై వృద్ధుల అనుభవాలు, విలువలు నేటి తరానికి మార్గదర్శనం చేస్తాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బాల భవన్ లో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. కుటుంబ జీవనంలో వయోవృద్ధులు ఇటీవల కాలంలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమానికి ఉద్దేశించిన అనేక చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ యాక్ట్ 2007 ప్రకారం వృద్ధుల సంక్షేమానికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. తమ పిల్లల పేరిట ఆస్తులు రాసినప్పటికీ వాళ్ల పట్టించుకోని పక్షంలో ఆస్తులను వెనక్కు తీసుకునే అవకాశం ఉందన్నారు. మహిళా సంఘాల్లో 65 ఏళ్లు ఉన్న వృద్ధ స్త్రీలకు కూడా ప్రభుత్వం రుణాలను ఇస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధాప్య దశలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఇష్టమైన వ్యాపకాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. గద్వాలలోని స్మృతి వనంలో యోగ షెడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. రెడ్ క్రాస్ భవనంలోనూ రిక్రియేషన్ సౌకర్యాలను కల్పించామన్నారు. వయోవృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన సంబంధిత అధికారులను, తనను కూడా సంప్రదించవచ్చని న్యాయం చేస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం పలు రంగాల్లో విశేష కృషి చేసిన వయోవృద్ధులను కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ హక్కులు, చట్టాలపై ముద్రించిన పుస్తకాలను విడుదల చేశారు. వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్లు గిరిజా కళ్యాణి, మైథిలి, డిడబ్ల్యూఓ సునంద, డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఏపిడి శ్రీనివాస్, డిసిపిఓ నరసింహ, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ అయ్యపూ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షులు మోహన్ రావు, విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## -అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-05(విజన్ ఆంధ్ర)అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి మండలం కనగర్తి గ్రామానికి చెందిన బండ్రి అజయ్ కుమార్ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామానికి చెందిన గౌడ అశోక్ తన కుమార్తె గౌడ శ్రీవల్లికు 100 శాతం వికలాంగత్వం ఉందని తనకు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన తంగెళ అనిత తాను బిఎస్సి నర్సింగ్ పూర్తి చేశానని తనకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టుల్లో ఏదైనా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారిది సొసైటీ కి రాస్తూ ఔట్‌సోర్సింగ్ కింద అవకాశాలు వచ్చినప్పుడు పరిశీలించాలని తెలిపారు. రామగిరి మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరి తన ఇంటికి సింగరేణి ప్రాజెక్టు వారు ప్రాజెక్టు నెంబర్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలి

## ప్రజావాణిలో 44 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ వారం మొత్తం 44 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వివిధ శాఖలకు సంబంధించి జిల్లా ప్రజావాణికి వచ్చిన మొత్తం 94 అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. మండల స్థాయి ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను కూడా సంబంధిత శాఖల అధికారులు తమ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించి సకాలంలో పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా కూటమి ప్రజాస్వామ్య పరిరక్షణ శంఖారావం

## హనుమకొండలో అంబేద్కర్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
## పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సిపిఐ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు
## సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే తొలగించాలని డిమాండ్



హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) : జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి పార్టీలు శంఖారావం పూరించాయి. సోమవారం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకుని ఓట్ల అక్రమాలకు పాల్పడుతోందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా అంబేద్కర్ సెంటర్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర చేపట్టారు.అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ ప్రదర్శనలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా జి. ప్రభాకర్ రెడ్డి, న్యూ డెమొక్రసీ, తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు నున్నా అప్పారావు, చిల్లా రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నాయకులు కలిసి కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సర్ ప్రక్రియ పేరుతో కోట్లాది మంది ఓట్లు అక్రమంగా తొలగించిన కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ వ్యవస్థను కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేలా జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని మండిపడ్డారు. దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరగాలంటే ప్రస్తుత ఎన్నికల ప్రధాన అధికారి తప్పుకోవాలని స్పష్టం చేశారు. మొదట ఈడీ, సీబీఐని ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను బిజెపిలో చేర్చుకున్నారని, నేడు ఓట్ చోరీకి పాల్పడుతూ అక్రమంగా ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికలలో ఓట్ చోరీపై నోరు మెదపడం లేదని అన్నారు.సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అర్హులైన సామాన్యుల, పేదల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్నిఅపహాస్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.గతంలో మాదిరిగా సీఈసీ ఎంపిక ప్రక్రియలో చీఫ్ జస్టిస్ ను భాగస్వామ్యం చేయాలన్నారు. తొలగించిన ప్రతి ఒక్క ఓటును వెంటనే పునరుద్ధరించాలని, అలాగే వివాదాస్పదంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇండియా కూటమి పోరాటంతో ఇప్పటికే రెండు విజయాలు సాధించామని, సీఈసీ ని తొలగించే వరకూ పోరాడి మరో విజయం సాధించాలని అన్నారు. సీఈసీ ని ఉపయోగించుకునే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసే వరకు ఇండియా కూటమి దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తాయని హెచ్చరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ మేరా కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ సంగ వెంకట్రాజం, కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ దుద్దిల్ల శ్రీను బాబు, డిసిసి మీడియా, కమ్యూనికేషన్ కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఎం జిల్లా నాయకులు ఎస్. వాసుదేవ రెడ్డి,గొడుగు వెంకట్, టి. ఉప్పలయ్య, చక్రపాణి, కమలాపూర్ ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, వరంగల్ మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజీ రెడ్డి, టీపీసీసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాస్ రావు, బత్తిని శ్రీనివాస్,కూచన రవళి,మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, దొమ్మటి సాంబయ్య, శ్రీనివాస్ గౌడ్, డీబీఎఫ్ నాయకులు చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అలంపూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు,

## 2009 వరద బాధితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి




అలంపూర్ అక్టోబర్ 5(విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, అలాగే 2009 నాటి వరద బాధితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని అలంపూర్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు తమ విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా డెవలప్మెంట్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూఅలంపూరు పరిసర ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అదేవిధంగా 2009 వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఇప్పటివరకు ఇళ్ల పట్టాలు అందకపోవడం విచారకరమని, ప్రభుత్వం స్పందించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిసి కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి , ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, గౌరవ సలహాదారులు ఆంజనేయులు, కమిటీ ప్రతినిధులు రజిని బాబు, ముస్తఫా, సురేష్, సంజీవ నాయుడు, విజయ్ రెడ్డి, వెంకట స్వామి, పాండు, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# 100--106 కాలువలకు నీటిని విడుదల చేయాలి

## సూపర్డెంట్ ఇంజనీర్ బి శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేసిన ఇటిక్యాల మండలం రైతులు

ఇటిక్యాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఇటిక్యాల మండలం ఊదండాపురం, షాబాద్, చాగాపురం, బుద్దారెడ్డిపల్లి, శెనగపల్లి గ్రామాల రైతులు సోమవారం 100-- 106 కాలువలకు నీటిని విడుదల చేయాలని జిల్లా నీటిపారుదల శాఖ అధికారి బి శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూమా మండలాలకు నీటీ పారుదల ఉన్నటువంటి 100-- 106 కాలువలకు వారంలో 3 రోజులు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. ఇట్టి నీరు కొండపల్లి, మల్లెం దొడ్డి, వరకే నీటిని రైతులు పారించుకుంటున్నారు. మా గ్రామాలకు మాత్రం నీరు రావడం లేదు కావున మా యందు దయవుంచి నీటిపారుదల అధికారులు ఇంకా 3 రోజులు మొత్తం 6 రోజులు నీటిని విడుదల చేసి రైతులకు వ్యవసాయముకు, పశువులకు త్రాగునీటిని వదలాలని నీటి పారుదల సూపర్డెంట్ ఇంజనీర్ అధికారిని కోరుకున్నామని తెలిపారు. ఇట్టి విషయంపై విజన్ ఆంధ్ర పత్రిక ప్రతినిధి సూపర్డెంట్ ఇంజనీర్ బి శ్రీనివాస్ ను వివరణ కోరగా, ఈ సంవత్సరము వర్షపాతం తక్కువగా ఉన్నందున నీటిని సర్దుబాటు చేస్తూ వారంలో 3 రోజులు నీటిని విడుదల చేస్తున్నాము. కానీ పై రైతులు నీటిని అడ్డు వేసుకొని నీటిని వినియోగించుతున్నారని రైతులు మా దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యపై మా సిబ్బందితో విచారణ జరిపించి నీటిని వృధా చేయకుండా చర్యలు తీసుకుంటామని, నీటిని క్రింది గ్రామాలకు పారుదల అయ్యేటట్లు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఊదండాపురం, షాబాద్, చాగాపురం, బుద్దారెడ్డిపల్లి, శెనగపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# వారసత్వ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ పై ప్రజావాణిలో ఫిర్యాదు

## రూ.40 లక్షల బ్యాంక్ లోన్ పొందిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వినతి




వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర);-తమ వారసత్వ భూమిని అక్రమంగా, తప్పుడు పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుని బ్యాంకులో రూ.40 లక్షల రుణం (లోన్) పొందిన వ్యక్తులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పర్వతగిరి మండలానికి చెందిన ఇజ్జిగిరి గణేష్ మరియు బాధితులు అధికారులను కోరారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... తమకు సంప్రదాయబద్ధంగా వస్తున్న వారసత్వ భూమి సర్వే నెంబర్లు 691/దీ లో ఒక ఎకరం, 688 లో 10 గుంటలు, 689 లో 29 గుంటలు, 575 లో ఒక ఎకరం, 576/బి లో 6 గుంటలు, 591 లో 18 గుంటలు మరియు 593 లో 12 గుంటల భూమి పహానీలో ఉంది. ఈ భూమి తమ పూర్వీకుల నుంచి తమ ఆధీనంలోనే ఉంటూ,ప్రస్తుతం తామే సాగు చేసుకుంటున్నామని బాధితుడు తెలిపారు. అయితే, తమ కుటుంబ వారసులకు తెలియకుండా తమ భూమిని అక్రమంగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించి, మార్టిగేజ్ ద్వారా బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి 2016వ సంవత్సరంలో పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి మంజుల గొల్లపల్లి రమేష్ అనే వ్యక్తులు రూ. 40 లక్షల లోన్ తీసుకున్నారని ఆరోపించారు. రుణం చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు సదరు భూమిని వేలం/అటాచ్ చేస్తామని 2020లో నోటీసులు ఇవ్వడానికి వచ్చినప్పుడే ఈ అక్రమం వెలుగులోకి వచ్చిందని ఆయన తెలిపారు. తప్పుడు మార్గంలో చేయించుకున్న ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేసేలా సిఫారసు చేయాలని,ఘటనపై సమగ్ర పూర్తి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు ఇజ్జగిరి గణేష్ గొల్లపెల్లి కనుకయ్య,బైరి వెంకటస్వామి, రాచకొండ అల్లోరు,ముక్కెర భోజరాజు లు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తమకు న్యాయం జరపాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను వేడుకున్నారు. అధికారులు ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి తగు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేకూర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లు భవిష్యత్తులో జరగకుండా నివారించడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కూడా వారు డిమాండ్ చేశారు.

# కొండపల్లి గ్రామంలో దివ్యాంగుల పింఛన్ల ధృవీకరణను క్షేత్రస్థాయిలో పరిశీలించిన

## జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



గద్వాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల మండలంలోని కొండపల్లి గ్రామంలో దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి జిల్లా స్థాయి ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాల్గొని, దివ్యాంగుల పింఛన్ల ధృవీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా ధృవీకరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పింఛన్లకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, పంచాయతీ కార్యదర్శులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుట్బాల్ క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో జాతీయస్థాయి జూనియర్ బాలికల ఫుట్బాల్ ఛాంపియన్షిప్ కు ఎంపికైన క్రీడాకారులను సోమవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా అభినందించారు.గద్వాల పట్టణం లోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థి పవిత్ర, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మి ఇటీవల చత్తీస్గడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఫుట్బాల్ ఛాంపియన్షిప్ లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా ఫుట్బాల్ ఫెడరేషన్ ఉమెన్ యూత్ లీగ్ అండర్ 15 కేడీఆర్ క్లబ్ కు ఎంపికయ్యారు. ఈనెల ఏడవ తేదీ నుంచి నిజాంబాద్ లో జరిగే ఫుట్బాల్ క్యాంపులో పాల్గొని అనంతరం కర్ణాటకలోని బెల్గాంలో జరిగే జాతీయస్థాయి ఫుట్బాల్ ఛాంపియన్షిప్ లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, శిక్షకులు హైమావతి, స్రవంతి, విజయ్, తదితరులున్నారు.

## తెలంగాణ పోలీస్ గేమ్స్ స్పోర్ట్స్ మీట్‌లో పేట పోలీసుల ప్రతిభ

### గోల్డ్ మెడల్స్, ఒక బ్రౌంజ్ మెడల్ సాధించిన పోలీసులనుఅభినందించినఎస్పీ డాక్టర్ వినీత్




నారాయణపేట అక్టోబర్ 5( విజన్ ఆంధ్ర) హైదరాబాద్ లోని తెలంగాణ పోలీస్ అకాడమీ లో సెప్టెంబర్ 28,29,30 వరకు జరిగిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్--2026 లో నారా యణపేట జిల్లా పోలీస్ అధికారులు అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, హెడ్ కానిస్టేబుల్ బాలరాజు లు లాన్ టెన్నిస్ విభాగంలో ప్రతిభ కనబరిచి మూడు గోల్డ్ మెడల్స్, ఒక బ్రౌంజ్ మెడల్ పతకాలు సాధించ డం పట్ల జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ అభినందనలు తెలిపారు. లాన్ టెన్నిస్ సింగిల్స్ క్రీడా పోటీలలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్ 50, ఓపెన్ కేటగిరీ సింగిల్స్ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించగా, 40 విభాగంలో ఒక బ్రాంజ్ మెడల్ సాధించారు. అదేవిధంగా ఎన్ జి ఓ కేటగిరీలో ఆర్మడు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ బాల రాజు అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సంద ర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్,ఎచ్ సి బాలరాజులకు మెడల్స్ అందించి ప్రత్యేకంగా అభినందించి, శుభాకాం క్షలు తెలిపారు. పోలీస్ విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం అభి నందనీయమని పేర్కొన్నా రు. క్రీడలు పోలీసు సిబ్బంది లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవి శ్వాసం, పోటీతత్వ స్ఫూర్తి ని పెంపొందిస్తాయని ఎస్పీ తెలిపారు. తెలంగాణ, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంలో క్రీడాకారుల ప్రతిభ కీలక మని పేర్కొన్నారు. వచ్చే నెలలో బెంగళూరులో నిర్వహించనున్న నేషనల్ పోలీస్ స్పోర్ట్స్ గేమ్సో పాల్గొని ఇదే ఉత్సాహంతో మరిన్ని పథకాలు సాధించి నారాయణపేట జిల్లాకు, తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురా వాలని ఎస్పి ఆకాంక్షించా రు. ఈ సందర్భంగా పతకా లు సాధించిన అధికారులు, సిబ్బందికి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏఎస్ రెడ్డి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్ ప్రారంభం



నారాయణపేట అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) నారాయణపేట పట్టణంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏఎస్ రెడ్డి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులకు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టణ ఎస్సై వెంకటేశ్వర్లు క్లాసెస్‌ను ప్రారంభించారు. స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్ అన గానే ముందుగా గుర్తుకు వచ్చే పేరు ఏఎస్ రెడ్డి హైద రాబాద్‌తో పాటు మహబూ బ్‌నగర్ వివిధ ప్రాంతాల్లో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి, వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్‌లో శిక్షణ అందిస్తూ విజయవంతంగా కొనసాగిస్తున్నారన్నారు. నారాయణపేట ప్రాంతంలో చాలామంది నిరుద్యోగుల కు ఇంగ్లీష్ కమ్యూనికేష న్‌లో ఇబ్బందులు ఉండ టాన్ని గుర్తించిన ఏఎస్ రెడ్డి వారికి ఉద్యోగ అవకాశాల్లో ఉపయోగపడేలా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అందించాలనే దృఢ సంకల్పంతో నారాయ ణపేటలో ఈ క్లాసెస్‌ను ప్రారంభించారు. **ప్రత్యేకంగా ఉచిత శిక్షణ** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్‌వారియర్స్ డిఫెన్స్ అకా డమీ విద్యార్థిని, విద్యార్థు లకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసెస్ను అందించ నున్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు, ఉచితంగా ఇంగ్లీష్ కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఈ అవకా శాన్ని వినియోగించు కోవాలాని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ కోరారు. ఇంగ్లీష్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న నారాయణపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రెడ్డి , నారాయణరెడ్డి , లయన్ కన్న జగదీష్, లయన్ డాక్టర్ ఆంజనేయు లు ఆర్మీ , లయన్ శాంత గ, వారియర్స్ డిఫెన్స్ అకాడ మీ ఇన్‌చార్జ్ లయన్ ఎస్. చక్రవర్తి , వారియర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ బన్నీ




కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 5 (విజన్ఆంధ్ర)హిమాచల్ ప్రదేశ్‌లోని తరంగ్ 2 అతి ఎత్తైన పర్వతాము ను 6,021 మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థివిద్యార్థి బన్నీని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సన్మానించారు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, కామారెడ్డిలో బీకాం తుది సంవత్సరం చదువుతున్న విశ్లావత్ బన్నీ హిమాచల్ ప్రదేశ్‌లోని 6,021 మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి చారిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థి విశ్లావత్ బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యతో పాటు సాహస క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా తమ ప్రతిభను వివిధ రంగాల్లో చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 109 ఫిర్యాదులు

కామారెడ్డి బ్యూరో అక్టోబర్5 (విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 109 ఫిర్యాదులు, వినతులు అందాయి. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వారి సమస్యలను సానుకూలంగా విని



నిబంధనల పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, డీఆర్ఓ పాండు, సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హమాలీల భద్రత మా బాధ్యత

### వికారాబాద్ ఏఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 05 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ వైస్ చైర్మన్ మల్లేశం ఆధ్వర్యంలో వికారాబాద్ మార్కెట్ యార్డులో పనిచేస్తున్నటువంటి హమాలీలతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హమాలీలకు మార్కెట్ కమిటీ తరపు నుండి రెండు లక్షల రూపాయలు ప్రమాద బీమా వర్తింప చేస్తామని ఆయన చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వం ద్వారా అందించే లేబర్ ఇన్సూరెన్స్ కార్డు సైతం ప్రతి ఒక్క హమాలీకి అందేలా చూస్తామని ఆయన స్పష్టం చేశారు. హమాలీలకు సంబందించిన వివిధ సమస్యలపై చర్చించి వారికీ తప్పకుండ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు దారులు హమాలీలు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. త్వరలో మార్కెట్ తరపున హమాలీలకు నూతన వస్త్రాలు అందిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) : అధికారులు తప్పనిసరిగా ముందస్తు పర్మిషన్ తెసుకోవాలని, ప్రజావాణికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అడికారులకు ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ,ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, వినతులను అధికారులు స్వయంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.




ప్రభుత్వ ఆద్వర్యంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ,ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు, సమయానికి హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణికి గైర్హాజరయ్యే అధికారులు తమ శాఖకు సంబంధించిన అంశాలపై ప్రజలకు సమాధానం ఇవ్వడంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో 103 ఫిర్యాదులు వచ్చాయని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ఫిర్యాదుల పరిష్కార పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి సోమవారం ప్రతి మండలం లో జరిగే ప్రజావాణి కి సంబంధించిన ఫిర్యాదు లపై మండల స్పెషల్ అడికారులు పూర్తి బాద్యత వహించాలని , ఫిర్యాదుల లిస్టు సబ్మిట్ చేయాలని అడికారులకు ఆదేశించారు. "మీ ప్రమాణం" యాప్ లో అడికారులు, సిబంధి అందరూ తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి , జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్ , జిల్లా అదికారులు , తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో సేవలందించాలి

### -కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-05(విజన్ ఆంధ్ర)మహనీయులు చూపిన సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలను నిర్వహించారు. అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో జన్మించిన వెంకటస్వామి కేంద్ర మంత్రిగా, వివిధ పదవుల్లో సేవలందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. పేదలకు ప్రభుత్వ భూముల పంపిణీలో కీలక పాత్ర పోషించడంతోపాటు వారి అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక పాత్ర పోషిస్తూ తెలంగాణ కోసం, పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించారని తెలిపారు. కోల్‌బెల్ట్ ప్రాంత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసి వారి గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. విధుల నిర్వహణలో అట్టడుగు వర్గాలకు అండగా నిలవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, సిపిఓ రవీందర్, ఇంటర్మీడియట్ అధికారిణి కల్పన, యువజన, క్రీడా శాఖ అధికారి సురేష్, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

## ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జూదంపై కఠిన చర్యలు

### ప్రతి గ్రామంలో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలి

### విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో సత్కరించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర,




కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 5(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఆధ్వర్యంలో మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజా భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, మహిళల భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లాంగ్ పెండింగ్, మిస్సింగ్ కేసుల ఛేదనతో పాటు ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్‌కు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలని అన్నారు. నిజమైన దోషులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి, అవసరమైన చోట ప్రమాద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న గ్రామాల్లో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనుమానాస్పద లావాదేవీలు, మోసాలపై ప్రజలకు తగిన సూచనలు అందించాలని తెలిపారు. జూదం నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తున్నట్లు లేదా ఆడుతున్నట్లు గుర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జూదం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నాయని, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే జూదాన్ని అరికట్టేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. మహిళలపై వేధింపులను అరికట్టడంతో పాటు మహిళా చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. దుర్గా నవరాత్రుల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన మేరకు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర నిఘా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు, యువతతో పోలీస్ అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఉత్సవాలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ప్రతి గ్రామంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతో పాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు తదితర కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. విధి నిర్వహణలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందిని గుర్తించి రివార్డులు, ప్రశంసాపత్రాల కోసం సిఫారసు చేయాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కే. నర్సింహారెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాసరావు, గట్టుమల్లు, విజయభాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంతోష్ నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయిస్తా: దొంతగాని శాంతి కోటేష్ గౌడ్

జవహర్ నగర్, అక్టోబర్ 5, (విజన్ ఆంధ్ర): జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్ కాలనీలో త్వరలోనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని జవహర్ నగర్ మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసిజవహర్ నగర్ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలిసివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కాలనీలో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కరెంటు స్తంభాలు లేకపోవడంతో రాత్రివేళల్లో తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నామని స్థానికులు తెలిపారు. వీర్లబుజంగం ఆధ్వర్యంలో జరిగినఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ శారద మనోధర్ రెడ్డి, ఎరగుంట్ల వెంకటేశ్వర్లు, రఫిక్, రాజుయాదవ్, నాగేష్, అర్జున్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అమ్మ హాస్పిటల్ ప్రారంభించిన మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 5(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా కేంద్రంలో అమ్మ హాస్పిటల్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ హాస్పిటల్ ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ. జిల్లా కేంద్రంలో నూతన హాస్పిటల్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్, మాజీ డీసీసీ అధ్యక్షులు



కైలాస్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, నౌసిలాల్, అనంత్ రెడ్డి, సుతారి రమేష్, అనంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నౌసిలాల్, కృష్ణారావు, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రాజగౌడ్, రాజు, సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కౌన్సిలర్లు షేరు, సత్యం, అంజాద్, జావీద్, లడ్డు, సిద్దిక్, చిట్టిబాబు, గణేష్, గంగాధర్, మజీద్, కో ఆప్షన్ సభ్యులు ముబషీర్, అలీ బిన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు పండ్ల రాజు, వెంకట్ రావు, సుదర్శన్, వెంకటేష్, సలీం, భాస్కర్, నవీన్, ఘాజి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు రక్షణ కవచంగా 'మాట్లాడే బొమ్మ'
# మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహనకు వినూత్న ఆవిష్కరణ

ములుగు అక్టోబర్ 05;విజన్ ఆంధ్ర ప్రతినిధిచిన్నారులపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు, వారికి భద్రతపై అవగాహన కల్పించేందుకు ములుగు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వినూత్నంగా 'మాట్లాడే బొమ్మ'ను తీసుకువచ్చింది. జిల్లా న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ సోమవారం తన కార్యాలయంలో ఈ బొమ్మ పనితీరును పరిశీలించి ఆవిష్కరించారు. బొమ్మ శరీరంలోని నిర్దేశిత భాగాలను తాకినప్పుడు మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి ఎలా వివరిస్తుందో అధికారులు ప్రత్యక్షంగా చూపించారు. చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఈ బొమ్మ ఎంతో ఉపయోగకరంగా ఉందని న్యాయమూర్తి అభినందించారు. జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ చిన్నారులకు తమ భద్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ మాట్లాడే బొమ్మను 52 పాఠశాలల్లో నిర్వహించే



అవగాహన కార్యక్రమాల్లో వినియోగించాలని సూచించారు. అసౌకర్యం కలిగించే స్పర్శ, వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేసేలా చిన్నారుల్లో ధైర్యాన్ని నింపాలన్నారు. బాల్య వివాహాల నివారణ, బాలల పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పాలనాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు, జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా రెండు మాట్లాడే బొమ్మలను సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఒకదాన్ని జిల్లా న్యాయస్థానానికి అందించనున్నట్లు, మరోదాన్ని బాల రక్ష భవన్‌లో ఉంచనున్నట్లు వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పాఠశాలల్లో, ఇతర అగాహన సదస్సుల్లో ఈ బొమ్మను వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. చండీశ్వరిదేవి, మహిళా శిశు సంక్షేమ అధికారి ప్రేమలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, పరిరక్షణ అధికారి హరికృష్ణ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## తొలిముద్దతో బాలలకు ఆరోగ్య పునాది: కౌన్సిలర్ కుత్బోద్దీన్



ములుగు అక్టోబర్ 05:విజన్ ఆంధ్ర ప్రతినిధిఅంగన్వాడీ తొలిముద్ద బాలల ఆరోగ్యానికి పునాది అని 16వ వార్డు కౌన్సిలర్ ఎండి కుత్బోద్దీన్ అన్నారు. బ్యాంకు కాలనీ అంగన్వాడీలో పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోషకాహారం తినిపించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎ. సుగుణ, ఆయమ్మ రోజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి పవర్ - ప్రతి అర్జీకి పరిష్కారమే లక్ష్యం: కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు అక్టోబర్ 05;విజన్ ఆంధ్ర ప్రతినిధిప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను హెచ్చరించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్లు మహేందర్, సంపత్ రావులతో కలిసి 24 దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, అన్ని అర్జీలను ఆన్ లైన్ లో నమోదు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

# బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

### -వెంకటాపురం మండలం లో ప్రజా సమస్యల పై బిఆర్ఎస్ దశల వారి ఉద్యమం

వెంకటాపురం అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర): ములుగు జిల్లా,వెంకటాపురం మండల కేంద్రము లోని బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి పూర్తిగా అమలు చేయకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గంప రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు గుడవర్తి నరసింహమూర్తి కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు."అబద్ధపు హామీలతో నమ్మించి, అధికార పీఠం ఎక్కిన తర్వాత ప్రజలను విస్మరించారు అని ,కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని ,నెరవేర్చకపోతే గద్దె దింపుతాం" అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలను పాతరేసి, 420కు పైగా హామీలను బొందపెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన ప్రజా కంటకంగా మారిందని, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులను నమ్మించి గొంతు కోశారని విమర్శించారు. ప్రతి హామీ నెరవేరే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం ఆగదని, వీధి వీధినా కాంగ్రెస్ నయవంచనను ఎండగడతామని స్పష్టం చేశారు. వెంకటాపురం మండలం లో నెలకొన్న ప్రధాన సమస్యలు రోడ్లు, విద్యుత్, రైతులకు సాగునీరు,



ఇందిరమ్మ ఇళ్లు అవకతవకలు ఇసుక సొసైటీల్లో లోపాలపై, మండలంలో కొంతమంది ప్రధాన అధికారులు విధులకు సక్రమంగా రాకపోవటం పై,22 ఏ తో పాటు వివిధ ప్రజా సమస్యల పై రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమం కార్యాచరణ రూపొందిస్తాం అని తెలిపారు. త్వరలో రాబోయే గ్రాడ్యుయేట్ శాసన మండలి ఎన్నికల్లో అర్హులను గుర్తించి ఓటు నమోదు ప్రక్రియ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిడెం రవికూమార్,అధికార ప్రతినిధి దర్రా దామోదర్,వెల్పూరి లక్ష్మి నారాయణ,జాగర శివాజీ, శాంతమూర్తి, మంచర్లనాగేశ్వరరావు,బట్ట నాగేంద్ర,గాడ్డం వివేక్, నాని నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# సింగరేణి భవన్ ముట్టడించిన కల్వకుంట్ల కవిత
## హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళన

హైదరాబాద్తెలంగాణ రక్షణ సేన సోమవారం నాడు సింగరేణి భవన్ ను ముట్టడించింది. ఈ కార్యక్రమంలో పార్టీ అధినేత్రి కవిత పాల్గొన్నారు. సీఎండీ వచ్చి చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. కవిత మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నాం. డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం తప్పించుకుంటోంది. డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కు. అది మీరు వేసే బిచ్చం కాదని అన్నారు. కచ్చితంగా నెలకు రెండు రోజులు మెడికల్ బోర్డు పెట్టాల్సిందే. సింగరేణి లాభాల్లో 35 శాతం బోనస్ ను కార్మికులకు ఇవ్వాల్సిందే. అలియాస్ పేర్లు ఉన్న కార్మికులను విజిలెన్స్ పేరుతో వేధించవద్దు. కార్మికులను వేధిస్తూ అక్రమంగా ఉద్యోగాలు తొలగించిన వాళ్లకు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వాలి. సమస్యల పరిష్కారానికి సంబంధించి సీఎండీ వచ్చి మాతో చర్చలు జరపాలని అన్నారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి

### రెడ్ క్రాస్ సేవలు విస్తరించాలి
### కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు అక్టోబర్ 05;విజన్ ఆంధ్ర ప్రతినిధిఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి రెడ్ క్రాస్ సేవలను విస్తరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. సోమవారం నూతనంగా ఎన్నికైన రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు కలెక్టర్ ను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు, విపత్తు సమయంలో సహాయం, విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డా. అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, కోశాధికారి శిరుప సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు రక్షణ కవచంగా 'మాట్లాడే బొమ్మ' మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహనకు వినూత్న ఆవిష్కరణ



ములుగు అక్టోబర్ 05;విజన్ ఆంధ్ర ప్రతినిధిచిన్నారులపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు, వారికి భద్రతపై అవగాహన కల్పించేందుకు ములుగు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వినూత్నంగా 'మాట్లాడే బొమ్మ'ను తీసుకువచ్చిందిజిల్లా న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ సోమవారం తన కార్యాలయంలో ఈ బొమ్మ పనితీరును పరిశీలించి ఆవిష్కరించారు. బొమ్మ శరీరంలోని నిర్దేశిత భాగాలను తాకినప్పుడు మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి ఎలా వివరిస్తుందో అధికారులు ప్రత్యక్షంగా చూపించారు. చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఈ బొమ్మ ఎంతో ఉపయోగకరంగా ఉందని న్యాయమూర్తి అభినందించారు. జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ చిన్నారులకు తమ భద్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ మాట్లాడే బొమ్మను 52 పాఠశాలల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో వినియోగించాలని సూచించారు. అసౌకర్యం కలిగించే స్పర్శ, వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేసేలా చిన్నారుల్లో ధైర్యాన్ని నింపాలన్నారు. బాల్య వివాహాల నివారణ, బాలల పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పాలనాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు, జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా రెండు మాట్లాడే బొమ్మలను సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఒకదాన్ని జిల్లా న్యాయస్థానానికి అందించనున్నట్లు, మరోదాన్ని బాల రక్ష భవన్‌లో ఉంచనున్నట్లు వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పాఠశాలల్లో, ఇతర అవగాహన సదస్సుల్లో ఈ బొమ్మను వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. చండీశ్వరిదేవి, మహిళా శిశు సంక్షేమ అధికారి ప్రేమలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, పరిరక్షణ అధికారి హరికృష్ణ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలసదనం చిన్నారులకు పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలి
### కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు అక్టోబర్ 05;జన్ ఆంధ్ర ప్రతినిధిబాలసదనంలోని చిన్నారులకు పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలసదనాన్ని సందర్శించిన కలెక్టర్ బాలికలకు అందిస్తున్న ఆహారం, విద్య, వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహార లడ్డూలను పంపిణీ చేశారు. చిన్నారులు ఆత్మవిశ్వాసంతో చదువులో రాణించేలా ప్రోత్సహించాలని, యోగా, ఆటలతో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యు.ఓ ప్రేమలత, డి.సి.పి.ఓ ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికల) ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి

జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర) అక్టోబర్ 5ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాలలో ఎస్ ఏ - 1 పరీక్షలు ఎలా జరుగుతున్నాయి, విద్యార్థులు ఎలా రాస్తున్నారని ప్రిన్సిపల్ తో ఆరా తీశారు. 3 పరీక్షలు అయ్యాయని, మంచిగా రాస్తున్నారని ప్రిన్సిపల్ కలెక్టర్ కి తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా పలకరిస్తూ మెనూ పాటిస్తున్నారా, మధ్యాహ్నం ఏం పెట్టారని ఆరా తీశారు. వంకాయ ఆలు కూర, సాంబారు పెట్టారని విద్యార్థులు తెలిపారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల హాజరు ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరంగా వండి విద్యార్థులకు వడ్డించాలని, పిల్లల భోజనం, వసతి, చదువు రాజీపడవద్దని, మీ పాఠశాలకు ఎలాంటి అవసరాలు అయినా ప్రాధాన్యత మేరకు పరిష్కరిస్తామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది



లేదని ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతగా భావించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (విజన్ఆంధ్ర.) అక్టోబర్ 5 సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి 85 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి దరఖాస్తులు నిశితంగా పరిశీలించి త్వరగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా సీఎం ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాకు వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి సమాచారంఅందించాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ భవ్య, వివిధ శాఖల జిల్లా అధికారుల తదితరులు పాల్గొన్నారు.

# కేఎల్‌హెచ్ హైదరాబాద్‌లో ఏజెంటిక్ ఏఐ క్యాంపస్




హైదరాబాద్, అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర) : భారత దేశపు మొట్టమొదటి ఏజెంటిక్ ఏఐ క్యాంపస్ కార్యక్రమాన్ని కేఎల్‌హెచ్ హైదరాబాద్ ప్రారంభించినట్లు కేఎల్‌హెచ్ ప్రతినిధులు సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ హెచ్‌సీఎల్ గ్రూప్ ఏఐ ల్యాబ్స్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుందని తెలిపారు. హెచ్‌సీఎల్ గ్రూప్ ఏఐ ల్యాబ్స్ జాతీయ అధిపతి దీపక్ సర్వనన్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు చెప్పారు. కేఎల్‌హెచ్ బచుపల్లి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.కోటేశ్వర రావు, నైపుణ్యాభివృద్ధి డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ కేఎల్‌హెచ్ తరఫున ఎంఓయూలో పాల్గొన్నట్లు చెప్పారు. బచుపల్లి, అజీజ్‌నగర్ క్యాంపస్‌లలో విద్యార్థులకు ప్రాజెక్ట్ ఆధారిత అభ్యసనం, ఏఐ అప్లికేషన్లు, ఏజెంటిక్ ఏఐపై శిక్షణతో పాటు బాధ్యతాయుతమైన ఏఐ వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

# నగరంలో '7 పాడెల్ ఎంఎస్ ధోనీ' ప్రారంభం




హైదరాబాద్, అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర) : '7పాడెల్ ఎంఎస్ ధోనీ' పాడెల్, ఫిట్‌నెస్, వెల్‌నెస్ కేంద్రాన్ని క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోనీ సోమవారం జూబ్లీహిల్స్ లో ప్రారంభించినట్లు పాడెల్‌పార్క్ ఇండియా సహ వ్యవస్థాపకుడు జిగర్ దోషి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో పాడెల్ కమ్యూనిటీని విస్తరించడమే లక్ష్యమన్నారు. దేశ వ్యాప్తంగా 320కి పైగా కోర్టులు నిర్మించిన సంస్థ, 2027 చివరికి 500కు పైగా కోర్టులకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేంద్రంలో 3 పాడెల్ కోర్టులు, జిమ్, రికవరీ సూట్, సౌనా, ఐస్ బాత్, ఇన్‌ఫ్రారెడ్ గది, యోగా, పైలేట్స్ స్టూడియో, కేఫే, వీక్షణ గ్యాలరీ ఉన్నాయని చెప్పారు. పాడెల్‌పార్క్ ఇండియా సహ వ్యవస్థాపకులు నిఖిల్ సచ్‌దేవ్, జిగర్ దోషి, ప్రతీక్ దోషి పాల్గొన్నారు. క్రీడాభివృద్ధికి మంచి కోర్టులు, సదుపాయాలు, అందరికీ ఆడే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## ఉద్యాన రైతుల విజ్ఞాన యాత్ర బస్సులను జెండా ఊపి ప్రారంభించిన
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన 100 మంది రైతులను ఈనెల 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఉద్యాన పంటల పరిశీలనకు పంపిస్తున్న నేపథ్యంలో సోమవారం ఐడిఓసి ఆవరణలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. బారామతిలోని నేషనల్ రీసెర్చ్ సెంటర్ తో పాటు మహాబలేశ్వర్, తదితర ప్రాంతాలకు జిల్లా రైతులు వెళ్లి అక్కడి ఉద్యాన తోటలను పరిశీలించనున్నారు. ఇలాంటి పర్యటనలు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. పర్యటన విజయవంతం కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, రాజశేఖర్, మహేష్, ఇమ్రాన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# సిల్క్ షోరూమ్ ప్రారంభించిన ప్రముఖ నటి

హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) హనుమకొండ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గరలో శ్రీ వారాహి లక్ష్మి సిల్క్ షో రూమ్ ను ప్రముఖ నటి నేహా శెట్టి సోమవారం ప్రారంభించారు. నటి నేహా శెట్టి మాట్లాడుతూ కస్టమర్లకు అతి తక్కువ ధరలలో అన్ని రకాల ఐటమ్స్సరసమైన ధరలలో దొరుకుతాయని అన్నారు. ఇట్టి అవకాశాన్ని నగర ప్రజలు ఉపయోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు



నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, కూడా చైర్మన్ గుండు సుధారాణి, షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుడికి నేతన్న 5 లక్షల భీమా చెక్కు అందజేసిన చేనేత సహకార సంఘం తరపున అధ్యక్షుడు డాన్ వీరన్న



అయిజ అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణ ప్రభుత్వము మరణించిన చేనేతకు నేతన్నలకు బీమా పథకం క్రింద ప్రకటయించినటువంటి ఐదు లక్షల బీమా చెక్కును అనారోగ్యంతో మరణించిన రోడ్డ వీరన్న,వారి కుమారుడైన రోడ్డ నరేష్ కు జోగులాంబ గద్వాల జిల్లా అయిజ చేనేత సహకార సంఘం తరపున అధ్యక్షుడు డాన్ వీరన్న, వారి బృందంతో కలిసి వారందరి సమక్షంలో చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా చేనేత జోళి శాఖ శ్యామల,ఈడిసి. పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అయిజ చేనేత సహకార సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో దొంగ ఓట్ల కలకలం

## - ఎన్నికల సంఘం కొరడా!







తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ జాబితా ప్రక్షాళన ప్రక్రియలో తీవ్ర కలకలం రేగింది. రాష్ట్ర వ్యాప్తంగా SIR-2026 ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ చేపడుతున్న సమయంలో పెద్ద ఎత్తున నకిలీ దరఖాస్తులు వెలుగులోకి రావడంతో కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. ఓటర్ జాబితా నుండి పేర్లను తొలగించేందుకు ఉపయోగించే ఖీశీతీఎ–7 ను కొందరు కావాలనే దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించింది. తప్పుడు వివరాలు, నకిలీ పత్రాలతో వేల సంఖ్యలో దరఖాస్తులు దాఖలు కావడాన్ని ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఇది సాధారణ అంశం కాదని, ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని అభిప్రాయపడిన ఎన్నికల సంఘం, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తప్పుడు వివరాలతో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరిపై విచారణ చేపట్టి =వజూతీవంవత్ఖ్‌అశీఅ శీట్ ఫ్తవ ౹ావశీజూశ్రీవ-ాఖ్, 1950 లోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సెక్షన్ ప్రకారం తప్పుడు ప్రకటన ఇవ్వడం, తప్పుడు సమాచారం అందించడం నేరంగా పరిగణించబడుతుంది. దీని కింద నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి అనుమానాస్పద దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిగా విచారించాలని ఎన్నికల అధికారులను ఆదేశించింది. అనుమానం ఉన్న చోట ఇంటింటి సర్వే నిర్వహించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి మరియు రాష్ట్రంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం ఉత్తర్వుల కాపీలను పంపించింది. SIR ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని, ఎలాంటి అక్రమాలకు తావు ఇవ్వవద్దని ఆదేశించింది. ఎన్నికల సంఘం తీసుకున్న ఈ కఠిన నిర్ణయంతో రాష్ట్రంలో ఓటర్ జాబితాలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట పడనుందని, నకిలీ దరఖాస్తులు పెట్టిన వారిలో వణుకు మొదలైందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# రెడ్ క్రాస్ చైర్మన్ గా పోతన్కర్ లక్ష్మీనారాయణ.

**- వైస్ చైర్మన్ గా డాక్టర్ శీను నాయక్. కోశాధికారిగా కెంపుల నాగరాజు.**

**- శుభాకాంక్షలు తెలిపిన సభ్యులు**





నిజామాబాద్ అక్టోబర్05:( విజన్ ఆంధ్ర ) : జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గా పోతన్కర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ గా డాక్టర్ శీను నాయక్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి సోమవారం మధ్యాహ్నం నిజామాబాద్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన15 మంది సభ్యుల్లో పూర్తిస్థాయి సభ్యులు కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. 8 మంది సభ్యుల కోరం ఉన్న ఎన్నికల నిర్వహించవచ్చని ఎలక్షన్ అధికారి తెలిపారు. పూర్తిస్థాయిలో సభ్యులు హాజరైన సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, రాష్ట్ర రిప్రజెంటివ్ పదవులకు నామినేషన్ లు దాఖలు చేశారు. ఈ ఎన్నికల్లో చైర్మన్ గా పోతన్కర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ గా డాక్టర్ శీను నాయక్, కోశాధికారిగా కెంపుల నాగరాజు, స్టేట్ రిప్రజెంటివ్ గా జెస్సూ అనిల్ లు నామినేషన్ వేశారు. ఒక్కో పోస్టుకు ఒక్కరే నామినేషన్ వేయడంతో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎలక్షన్ అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా గెలుపొందిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. నూతన చైర్మన్ పోతన్ కార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృత పరుస్తామని, జిల్లాలో సేవాసమితి ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్క సభ్యుడికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు రెడ్ క్రాస్ లో ఆదివారం జరిగిన గెలుపొందిన డైరెక్టర్ లు ముందుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎన్నికలు నిర్వహించారు.

# ముధోల్ నియోజకవర్గ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన మాజీ ఎమ్మెల్యేవిఠల్ రెడ్డి



నిర్మల్ : అక్టోబర్ 5 : విజన్ ఆంధ్ర. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ముధోల్నియోజకవర్గంలోని పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు, ఒక మున్సిపాలిటీ పరిధిలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మొత్తం ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు వేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. భైంసా పట్టణంలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని, ఉన్న న్యాయపరమైన స్టే సమస్యను పరిష్కరించి నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కుబీర్ మండలం నిఘ్వ గ్రామంలో శ్రీ గడ్డన్న వాగు ప్రాజెక్టు ముంపు గ్రామానికి సంబంధించి సిద్ధంగా ఉన్న సుమారు 300 ప్లాట్లను లబ్ధిదారులకు అందించాలని, ఇప్పటికే పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.భైంసా మండలం గుండెగాం గ్రామస్థులకు ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, అవార్డు ప్రకారం నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.తానూర్ మండలంలోని మొగిలి, హిప్పనెల్లి, మొగిలితండా, కోలూర్, కోలూర్ తండా, ఝరి, ఝరి బి వాడ, మహాలింగి తదితర గ్రామాల్లో భూముల సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యపై ఇప్పటికే అధికారులు విచారణ చేపట్టారని, గ్రామ సభలు నిర్వహించి రైతుల ఫిర్యాదులను స్వీకరిస్తున్న విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కుబీర్ మండలం హల్ద గ్రామంలోని కొంతమంది రైతులకు గతంలో జారీ చేసిన సీలింగ్ సర్టిఫికెట్లకు పట్టాలు అమలు కాకపోవడంతోపాటు పాస్‌బుక్కులు రాలేదని, ఈ సమస్యను కూడా త్వరగా పరిష్కరించాలని విఠల్ రెడ్డి కోరారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్



మెదక్ అక్టోబర్ 5, విజన్ ఆంధ్ర : ప్రజావాణి కార్యక్రమంలో మెదక్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 79 దరఖాస్తులను స్వీకరించారు. అందులో భూ భారతి 24 ఇందిరమ్మ ఇండ్లు 15,పెన్షన్ 3,ఇతర 37మొత్తం 79 దరఖాస్తులను స్వీకరించారు ఈ సందర్భంగా డి ఆర్ ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించి పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు స్పందిస్తూ, వినతులను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ ఓ ఓజి, డిఆర్డిఓ శ్రీనివాసరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి గుండెపై సమర శంఖం!!

**- భూగర్భపు నెత్తుటి చెమటకు దక్కని న్యాయం**
**- డిపెండెంట్ ఉద్యోగం... హక్కే**
**- 10 శాతానికే ఉద్యోగాలా?**
**- 35 శాతం బోనస్ డిమాండ్**

హైదరాబాద్ ( పొలిటికల్ డెస్క్ ), అక్టోబర్ 5:
నల్ల బంగారాన్ని తవ్వి తీస్తూ, చీకటి గనుల్లో కరిగిపోతూ నిండు రాష్ట్రానికి వెలుగులు పంచే సింగరేణి కార్మికుడి కష్టానికి విలువ కట్టేదెవరు? తరం మారినా తలరాత మారని ఆ బతుకుల వేదన హైదరాబాద్ నడిబొడ్డున మరోసారి పెను తుఫానులా రగిలింది. సోమవారం నాడు లక్డీకాపూల్‌లోని సింగరేణి భవన్ ప్రాంగణం ఆందోళనల అగ్నిగుండంగా మారింది. చురుక్కుమనే నడి ఎండను సైతం లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయించిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకులు యాజమాన్య ఉదాసీన వైఖరిపై విరుచుకుపడ్డారు. కార్మికుల హక్కుల కోసం తాడోపేడో తేల్చుకునేందుకు గళమెత్తారు.

**డిపెండెంట్ ఉద్యోగం భిక్ష కాదు.. కార్మికుడి హక్కు!**

ధర్నా సందర్భంగా కల్వకుంట్ల కవిత చేసిన భావోద్వేగ ప్రసంగం సభికుల గుండెలను తాకింది:

**మెడికల్ బోర్డు ప్రక్రియ వేగవంతం**

అనారోగ్యంతో అలమటిస్తూ మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ నిబంధనల ప్రకారం 'అన్‌ఫిట్' చేసి, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలి. పది శాతం మందికి మాత్రమే అవకాశమిస్తూ మిగిలిన వారిని విస్మరించడం దారుణం.

**లాభాల్లో 35 శాతం వాటా**

సంస్థ లాభాల్లో కార్మికుల కష్టానికి గుర్తింపుగా 35 శాతం బోనస్ అందించాలి.

**విజిలెన్స్ వేధింపులకు స్వస్తి**

అలియాస్ పేర్ల సాకుతో విజిలెన్స్ విచారణల పేరుతో వేధిస్తూ అన్యాయంగా తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి.

**ప్రభుత్వ బకాయిల చెల్లింపు**

సంస్థను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
"తెలంగాణకు సింగరేణి ఊపిరి లాంటిది. కార్మికుల రక్తాన్ని పిండి వెలుగులు పంచుకుంటున్న పాలకులు, వారి త్యాగాలను విస్మరిస్తే చూస్తూ ఊరుకోం. డిపెండెంట్ ఉద్యోగం అనేది యాజమాన్యం వేసే భిక్ష కాదు.. ఆ బొగ్గు గని కార్మికుడు పోరాడి సాధించుకున్న హక్కు!" కల్వకుంట్ల కవిత

**రెండు నెలల డెడ్‌లైన్.. లేదంటే ఆమరణ దీక్ష!**

భారీ ముట్టడితో సింగరేణి భవన్ పరిసరాల్లో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో, దిగివచ్చిన యాజమాన్య ప్రతినిధులు ఆందోళనకారులతో ముఖాముఖి చర్చలు జరిపారు. సీ అండ్ ఎండీ




ఆదేశాల మేరకు డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
అయితే, మాటలతో సరిపెడితే సహించేది లేదని కవిత స్పష్టం చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు రెండు నెలల గడువు ఇస్తున్నామని, ఆలోగా డిపెండెంట్ ఉద్యోగాల ప్రక్రియ ప్రారంభం కాకపోతే సింగరేణి భవన్ ప్రధాన ద్వారం ఎదుటే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని గంభీర హెచ్చరిక జారీ చేశారు.
ఈ ఉద్యమంలో పాల్గొన్న హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఒకప్పుడు స్వతంత్రంగా వెలుగొందిన సింగరేణి నేడు పాలకుల కబంధ హస్తాల్లో బందీ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా సింగరేణి పరిధిలోనే ఉంచాలని, నైనీ బ్లాక్‌లోనూ స్థానిక కార్మికులకే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

**గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# కల్వకుర్తిని వణికించిన పశు దొంగల ముఠా - ఎట్టకేలకు చిక్కిన కిలాడీలు!

## రైతన్నల కంట్లో నిద్ర లేకుండా చేసిన 4 గురు దొంగలు అరెస్ట్

### - లక్ష నగదు, టాటా ఏసీ స్వాధీనం

కల్వకుర్తి,అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర ):
కల్వకుర్తి మండలం.. గత కొన్ని నెలలుగా రైతులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. రాత్రి పడితే చాలు, కొట్టంలోని పశువులు మాయమవుతున్నాయి. జీవనాధారమైన ఆవులు, గేదెలు కళ్ళ ముందే దొంగల పాలవుతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఎట్టకేలకు ఆ దొంగల ఆట కట్టించారు కల్వకుర్తి పోలీసులు. పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దొంగతనాల వెనుక నంద్యాల జిల్లా ఆత్మకూర్ ప్రాంతానికి చెందిన ఇంటర్ స్టేట్ ముఠా ఉన్నట్లు తేలింది. పక్కా ప్లాన్ తో, టాటా ఏసీ వాహనంలో వచ్చి, అర్ధరాత్రి పశువులను ఎత్తుకెళ్తున్నారు. నిఘా పెట్టిన కల్వకుర్తి పోలీసులు ఆదివారం రాత్రి ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకున్నారు.

***చిక్కిన నిందితులు –***

దేగ పుల్లయ్య, పగ్గాల రాముడు, యమ్మని చంద్ర మరియు ఎండి ఇబ్రహీం (అందరూ ఆత్మకూర్, నంద్యాల జిల్లా వాసులు)
వారి వద్ద నుంచి పోలీసులు రూ. 1,00,000 నగదు మరియు నేరానికి ఉపయోగించిన టాటా ఏసీ ఆటో (వాహనం) ను స్వాధీనం




చేసుకున్నారు.

***పోలీసుల అప్రమత్తతకు నిదర్శనం:***

ఈ ఆపరేషన్ మొత్తం కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఆయనతో పాటు కల్వకుర్తి పోలీస్ సిబ్బంది అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్నారు. ఎస్ఐ కురుమూర్తి మరియు సిబ్బంది చూపిన తెగువ, అప్రమత్తత పట్ల ఉన్నతాధికారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ముఠా పట్టుబడటంతో కల్వకుర్తి మండల రైతులు ఊపిరి పీల్చుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్ కు తరలించారు.

***ఇది కేవలం అరెస్ట్ కాదు.. రైతన్నకు భరోసా!***

# ప్రజా సమస్యలే పోలీసుల తొలి ప్రాధాన్యం

**- ఎస్పీ జానకి సంచలన వ్యాఖ్యలు**
**- ప్రజావాణికి పోటెత్తిన ప్రజలు**
**- ఫిర్యాదుల వెల్లువ**
**- అక్కడికక్కడే పరిష్కారానికి ఆదేశాలు**





తెలంగాణ స్టేట్ బ్యూరో,మహబూబ్ నగర్, అక్టోబర్ 05,విజన్ ఆంధ్ర: మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం సోమవారం ప్రజలతో కిటకిటలాడింది. ప్రజల గోడు వినేందుకు, వారి కష్టాలకు అండగా నిలిచేందుకు జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ నిర్వహించిన ప్రజావాణి (గ్రీఠుయిఖుఖుఅఖ) కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది బాధితులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర, శాశ్వత పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ప్రజల సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు.

***ఎస్పీ స్వయంగా విన్న వినతులు:***

జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు భూ కబ్జాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, పెండింగ్ కేసులపై తమ ఆవేదనను ఎస్పీ ముందు వెల్లబోశారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ స్వయంగా క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అంతేకాదు.. కేవలం ఫిర్యాదు స్వీకరించి పక్కన పెట్టకుండా, అక్కడికక్కడే సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలకు ఫోన్ చేసి, "ఈ ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి, చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించండి. బాధితుడికి న్యాయం జరగాలి" అంటూ కఠినంగా ఆదేశాలు జారీ చేశారు.

***అధికారులకు స్ట్రాంగ్ వార్నింగ్:***

ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకోవాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చివరగా ఎస్పీ ప్రజలకు భరోసా ఇస్తూ.. "పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఎలాంటి సమస్య ఎదురైనా, ఎవరి బెదిరింపులకూ భయపడకుండా నిర్భయంగా నేరుగా పోలీసులను సంప్రదించండి. మీకు అండగా మేమున్నాం" అని పిలుపునిచ్చారు. ఎస్పీ ఈ చొరవపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# భూ రీసర్వేను వేగవంతం చేయాలి

**- అక్టోబర్ 15లోగా వీరాయపల్లిలో పనులు పూర్తి కావాలి**
**- అనవసర వ్యయం వద్దని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కలెక్టర్ సూచన**
**- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో భూ రీసర్వే ప్రక్రియను వేగవంతంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో భూ రీసర్వేలో భాగంగా నిర్వహిస్తున్న విలేజ్ బౌండరీ (హద్దుల గుర్తింపు) పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వేకు సంబంధించి రైతులకు ముందస్తుగా నోటీసులు అందజేయడంతో పాటు గ్రామ పంచాయతీలో పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలన్నారు. వీరాయపల్లి గ్రామంలో రీసర్వే పనులను అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

***పింఛను దరఖాస్తు తనిఖీ***



గ్రామానికి చెందిన ప్రమీల అనే ఒంటరి మహిళ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, కలెక్టర్ స్వయంగా ఆమె ఇంటికి వెళ్లారు. దరఖాస్తును, వివరాలను తనిఖీ చేసి ధ్రువీకరించారు. పింఛన్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చూడాలని అధికారులను ఆదేశించారు.



***ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలి***

అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు పరిమితికి మించి ఖర్చు చేయవద్దని, బేస్‌మెంట్‌లను అనవసరంగా ఎత్తు పెంచి అదనపు వ్యయం చేసుకోవద్దని సూచించారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు సాగేలా అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం కోసం అర్హులైన వారికి మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందేలా చూడాలని, బిల్లులు సకాలంలో మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, రెవెన్యూ అదనపు. కలెక్టర్ వినోద్ కుమార్, జెడ్పీ సీఈవో యాదయ్య, స్థానిక సర్పంచ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**- కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5(విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ లు కూడా కలెక్టర్‌తో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, ఆ సమాచారాన్ని సంబంధిత దరఖాస్తుదారునికి తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదు తమ శాఖ పరిధిలోకి రాకపోతే వెంటనే సంబంధిత శాఖకు లేఖ ద్వారా బదిలీ చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం పరిష్కరించడానికి వీలుకాని వినతులను పైఅధికారులకు పంపాలని, లేదా ఏ కారణం చేత పరిష్కరించలేకపోతున్నామో దరఖాస్తుదారునికి స్పష్టంగా తెలియజేయాలే తప్ప దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని గట్టిగా హెచ్చరించారు. ముఖ్యంగా సీఎం కార్యాలయం, జిల్లా ఇన్చార్జ్ మంత్రి ప్రజావాణిల నుంచి వచ్చి పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాగా, సోమవారం నాటి జిల్లాస్థాయి ప్రజావాణికి 70 దరఖాస్తులు రాగా, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 7 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కుమ్మరుల సమస్యలను పరిష్కరించాలి

***జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం వినతి***



వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా వ్యాప్తంగా కుమ్మరి వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం పిలుపుమేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షుడు రాములు కుమ్మర ఆధ్వర్యంలో సంఘం నాయకులు, కులపెద్దలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.?ఈ సందర్భంగా జిల్లా కుమ్మరి సంఘం అధ్యక్షుడు రాములు మాట్లాడారు కుమ్మరి వృత్తిదారులకు ప్రధానంగా అవసరమైన బంకమట్టిని సేకరించడం, రవాణా చేసుకోవడం ప్రస్తుతం తీవ్ర భారంగా మారింది. ప్రభుత్వం బంకమట్టిని ఉచితంగా అందించడంతో పాటు, గ్రామాలకు రవాణా చేసుకునేందుకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాలి. కుమ్మరి వృత్తిదారులు తయారుచేసే మట్టి కుండలు, ప్రమిదలు, దీపాలు, కూజాలు, మట్టి గణపతి విగ్రహాలు తదితర సంప్రదాయ వస్తువులను విక్రయించుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక మార్కెట్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ పథకాలు, జాతరలు, ఉత్సవాలు మరియు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనలలో కుమ్మరులు తయారు చేసిన మట్టి ఉత్పత్తుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఆధునిక పరికరాలు, ప్లాస్టిక్, ఇతర ప్రత్యామ్నాయ వస్తువుల వ్యాప్తి వల్ల మట్టి పాత్రలకు డిమాండ్ తగ్గి, కుమ్మరి కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటోంది. కుమ్మరి వృత్తిని కాపాడుకోవడానికి, యువతను ఈ వైపు ప్రోత్సహించడానికి ఉచిత శిక్షణ, ఆర్థిక సహాయం, రుణ సదుపాయం, ఆధునిక పరికరాలు మరియు మార్కెటింగ్ సౌకర్యాలు అందించాలి. ?తరతరాలుగా పర్యావరణహితమైన మట్టి పాత్రలను ప్రజలకు అందిస్తూ జీవిస్తున్న కుమ్మరి వృత్తిదారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సంఘం నాయకులు కోరారు.

# బస్తీ దవాఖానాల సంఖ్య పెంచాలి

**- సాయంత్రం వేళల్లోనూ వైద్య సేవలు అందించాలి**

**- ప్రజావాణిలో ఏఎంసీ శ్యాం సుందర్ రావు కు వినతిపత్రం సమర్పించిన అడ్వకేట్ సాయిని నవీన్ కుమార్**



బోడుప్పల్,అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో బస్తీ దవాఖానాల సంఖ్యను పెంచడంతో పాటు సాయంత్రం వేళల్లోనూ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ అడ్వకేట్,సామాజిక కార్యకర్త సాయిని నవీన్ కుమార్ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.భగత్ సింగ్ యువజన మండలి తరపున సమర్పించిన వినతిపత్రంలో రోజువారీ కూలీలు,నిర్మాణ కార్మికులు,ఆటో డ్రైవర్లు,చిన్న వ్యాపారులు,అసంఘటిత రంగ కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనుల్లో ఉండటం వల్ల ప్రభుత్వ వైద్య కేంద్రాలను వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.పని సమయాల కారణంగా కొంతమంది స్థానికంగా అనధికారికంగా వైద్యం చేసే వ్యక్తులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడుతోందని,దీనిని నివారించేందుకు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ వైద్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న దవాఖానాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓపీ సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్యులు,అవసరమైన మందులు, ప్రాథమిక వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచడంతో పాటు బస్తీ దవాఖానాల సేవలు,పని వేళలపై ప్రజలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు సమీపంలోనే ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉంటే పేద,మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని సాయిని నవీన్ కుమార్ పేర్కొన్నారు.

# తాటి/గీత కార్మికులకు ప్రభుత్వం భారీ సాయం

**- 40 వేల సేఫ్టీ కిట్ల పంపిణీకి సన్నాహాలు!**





తెలంగాణ స్టేట్ బ్యూరో,అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కల్లు గీసే సమయంలో జరిగే ప్రమాదాలను నివారించి, కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు భారీగా సేఫ్టీ కిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది.ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి జారిపడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఆధునిక భద్రతా పరికరాలతో కూడిన కిట్లను అందజేయనుంది.

*ప్రభుత్వ ప్రణాళిక ఇదే:*

తొలివిడతలో 40 వేల మంది గీత కార్మికులకు సేఫ్టీ కిట్లను పంపిణీ చేయనుంది. మొత్తంగా 50 వేల కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే 40 వేల కిట్ల సరఫరాకు చర్యలు పూర్తి కాగా, మరో 20 వేల కిట్లకు త్వరలోనే ఆర్డర్ ఇవ్వనుంది. ఈ కిట్లలో కల్లు గీసేటప్పుడు అవసరమయ్యే హెల్మెట్, సేఫ్టీ బెల్ట్, రోప్, గ్లౌజులు వంటి అన్ని భద్రతా పరికరాలు అందుబాటులో ఉండనున్నాయి. గీత వృత్తిపై ఆధారపడిన వేలాది కుటుంబాలకు ఈ నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కార్మికుల భద్రత విషయంలో ప్రభుత్వం చూపిస్తున్న చొరవ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యతో గీత కార్మికుల్లో భరోసా నెలకొననుంది.

# ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్లకు అన్యాయం.



నిజామాబాద్ అక్టోబర్05:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలలో కేవలం ఇద్దరూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను మాత్రమే ఎంపిక చేయడాన్నీ జిల్లా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. ఈ విషయంలో గతంలో అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలు ఇచ్చిన విస్మరించడం అక్షేపనీయమన్నారు.ఎల్ఎఫ్ ఎల్ హెచ్ఎం లు విధి నిర్వహణలో ఎస్ఏ లతో సమాన కేడర్ గా కాకుండా అడ్మినిస్ట్రేటర్ లుగా తీసుకొని ఎంపిక చేయకపోవడం శోచనీయమన్నారు. ఎంపిక తీరును తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ఈ విషయాలు మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా పాలనాధికారిణిని కలుస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలలో ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం లను అడ్మినిస్ట్రేటివ్ బేస్ గా తీసుకోవాలని, ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్స్ కు, ఆయలకు వెంటనే విత్తనాలు విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న జీవో నెంబర్ 25 ను సవరిస్తూ తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని డిమాండ్ చేశారు. పై అంశాలను ఎన్నిసార్లు పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడానికి రాష్ట్ర కార్యవర్గానికి వివరించడం జరుగుతుందన్నారు. త్వరలోనే ఈ అంశాలపై కార్యచరణ రూపొందించి ఆ దిశగా ముందుకు వెళ్తామన్నారు.ఈ సమావేశంలో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు కే మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షులు కొట్టూరు దేవదాస్ ప్రధాన కార్యదర్శి పి నాగేశ్వరరావు, కోశాధికారి జి సురేష్ రెడ్డి, చంద్రు నాయక్, రత్నకుమారి, కే నరేందర్ పి స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

# భీంగల్ పోలీస్ స్టేషన్ లో వ్యక్తి ఆత్మహత్యయత్నం ఘటనలో పోలీసుల తప్పు లేదు.

**- పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడి.**





నిజామాబాద్ అక్టోబర్05:( విజన్ ఆంధ్ర ) : భీంగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యయత్నం ఘటనలో పోలీసుల తప్పిదం లేదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. సోమవారం ఉదయం భీమ్గల్ పట్టణానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి పెట్రోల్ బాటిల్ తో వచ్చి నిప్పు పెట్టుకున్న విషయం తెలిసిందే. అదే సమయంలో భీమ్గల్ పోలీసు సిబ్బంది, స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులు మంటలు ఆర్పి అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించడం జరిగిందన్నారు.అక్కడ ప్రాథమిక సమాచారం నివేదికను బట్టి నిప్పంటించుకున్న వ్యక్తి సుధాకర్ భీంగల్ నివాసి అతను పాత బస్టాండ్ భీంగల్ లో ఒక టీ స్టాల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతని షాప్ కు ఎదురుగా ఉన్నటువంటి ఒక కిరాణా షాప్ అతను నా దగ్గర సిగరెట్లు కొనడం లేదని అతని దగ్గరికి ఇద్దరు రిపోర్టర్లను పంపించి బెదిరించడం జరిగిందన్నారు.అదేవిధంగా లేట్ నైట్ సమయంలోనూ షాపు నడిపిస్తున్నాడని పోలీసు వారు డ్యూటీ లో భాగముగా అతనిపై ఈ పెట్టీ కేసు వేశారని తెలిపారు. సుధాకర్ ను రిపోర్టర్ బెదిరించిన విషయాన్ని మనసులో పెట్టుకొని సుధాకర్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ వచ్చి ఆవరణలో నిప్పంటించుకోవడం జరిగిందన్నారు.. ఈ విషయంలో పోలీసు వ్యవస్థకు గాని అతనికి గాని ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలియజేశారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యాచరణ




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర): ఖమ్మం - నల్గొండ - వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాస్ గెలుపు కోసం మహబూబాబాద్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. మహబూబాబాద్ కోఆర్డినేటర్ ఎం.ఎన్. జైసింహ పడాల నాయకత్వంలో వెంకటేష్ జెట్టి, మెరుగు చక్రపాణి గౌడ్, టౌన్ ఇన్‌చార్జి ఎం.డి. ఆసిఫ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో శనివారం ఈ సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టే అంశాలపై చర్చించారు. మండలాల వారీగా పార్టీ కార్యక్రమాలను విస్తరించేందుకు మహబూబాబాద్‌కు చక్రపాణి, కేసముద్రానికి పవన్, గూడూరుకు అనిల్, నెల్లికుదురుకు వీరారెడ్డి, ఇనుగుర్తి కి రాకేష్‌లతో చర్చించారు. ఆయా మండలాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంతో పాటు పట్టభద్రుల ఓటర్లను చేరుకునే విధంగా కార్యాచరణ రూపొందించారు. క్షేత్రస్థాయి కార్యకర్తలు రహీం, పాషా, చక్రధర్, అమీర్, దుర్గాప్రసాద్, ఉదయ్ తదితరులు పార్టీకి అండగా ఉండి ఎన్నికల కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో ప్రధానంగా పట్టభద్రుల ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు సంబంధించిన ఫారం--18పై అవగాహన కల్పించడం, నియోజకవర్గ పరిధిలోని డిగ్రీ కళాశాలల సమాచారాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి సేకరించడం, మండల స్థాయిలో పార్టీ క్యాడర్‌ను నియమించడం వంటి అంశాలపై చర్చించారు. డిగ్రీ కళాశాలల్లో పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచార కార్యక్రమాలను నిర్వహించే విధానంపైనా చర్చ జరిగింది. అలాగే ప్రతి మండలంలో క్షేత్రస్థాయి కార్యకర్తలను గుర్తించి వారికి పార్టీ పరంగా తగిన గౌరవం, బాధ్యతలు కల్పించేలా నాయకత్వం సహకరించాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ పట్టభద్రుల ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గడల శ్రీనివాస్‌కు మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. సమాజంలో రాజకీయ ప్రక్షాళనకు, ప్రగతిశీల భవిష్యత్తు నిర్మాణానికి కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్న జనసేన పార్టీ తెలంగాణలో తన కార్యాచరణకు మరింత పదును పెంచుతోంది. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను యువత భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. రాజకీయాల్లో మార్పును కోరుకునే యువతను గుర్తించి వారికి పార్టీలో క్రియాశీల భాగస్వామ్యం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రజా సమస్యలపై అవగాహన, సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల నిబద్ధత ఉన్న ప్రతిభావంతులను రాజకీయాల్లోకి తీసుకురావడంపై దృష్టి సారిస్తోంది. అదే సమయంలో కొత్తగా పట్టభద్రులైన ఓటర్లను గుర్తించి ఓటరు జాబితాలో వారి పేర్ల నమోదుకు ప్రాధాన్యం ఇస్తోంది. మండల, నియోజకవర్గ స్థాయిలో యువతతో సమన్వయం పెంచుతూ పార్టీ బలోపేతానికి చర్యలు చేపడుతోంది. ప్రతిభావంతమైన నాయకత్వం ఒకవైపు, యువత భాగస్వామ్యం మరోవైపు ఉండేలా కార్యాచరణ రూపొందిస్తోంది. రాజకీయాల్లో కొత్త ఆలోచనలు, కొత్త నాయకత్వం, ప్రజా సమస్యలపై చురుకైన స్పందనకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తోంది. తెలంగాణలో రానున్న రోజుల్లో జనసేన రాజకీయ కార్యాచరణను మరింత విస్తృతం చేసే దిశగా ఈ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పట్టభద్రుల ఎన్నికలను వేదికగా చేసుకుని యువతను రాజకీయ ప్రక్రియలో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా పార్టీ తన దూకుడును పెంచుతోంది "

# కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**- హనుమకొండ డీసీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట 'ఇండియా' కూటమి నిరసన**

**- అంబేద్కర్ సెంటర్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు 'ఇండియా' కూటమి ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర**



హన్మకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 ( విజన్ ఆంధ్ర ) : ఏఐసీసీ పిలుపు మేరకు, రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తన గుప్పిట్లోకి తీసుకుని ఓట్ల అక్రమాలకు పాల్పడుతోందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా అంబేద్కర్ సెంటర్ నుండి హనుమకొండ కలెక్టరేట్ వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్ర చేపట్టి కలెక్టర్ కార్యాలయం వద్ద 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు, హుజూరాబాద్ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్, ఇండియా కూటమి నాయకులు కలిసి కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఫ్లకార్డులతో నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని తమ నిరసనను వ్యక్తం చేశారు.అనంతరం ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నాయకులు మాట్లాడుతూ, స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ వ్యవస్థను కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసేలా జరుగుతున్న అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలమైందని మండిపడ్డారు. దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలు జరగాలంటే ప్రస్తుత ఎన్నికల ప్రధాన అధికారి తప్పుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్ మేరా కో-ఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ సంగ వెంకట్రాజం, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి ప్రభాకర్ రెడ్డి, న్యూ డెమాక్రసీ జిల్లా కార్యదర్శి నున్నా అప్పారావు, టీజేఎస్ అధ్యక్షులు చిల్లా రాజేంద్ర ప్రసాద్,సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి, వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ దుద్దిల్ల శ్రీను బాబు మరియు పల్లె శ్రీనివాస్ గౌడ్, పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి ఛైర్మన్, కిసాన్ కాంగ్రెస్, హనుమకొండ, కుడా ఛైర్మన్ గుండు సుధారాణి, డిసిసి మీడియా ఽ కమ్యూనికేషన్ కమిటీ ఛైర్మన్ మార్క విజయ్ కుమార్, మరియు కూటమి నేతలు, కమలాపూర్ ఏఎంసి ఛైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, వరంగల్ మార్కెట్ ఛైర్మన్ పులి ప్రియాంక, పరకాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ చందుపట్ల రాజీ రెడ్డి, టీపీసీసి సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాస్ రావు, బత్తిని శ్రీనివాస్, కూచన రవళి, ఐవైసీ జాతీయ కో-ఆర్డినేటర్ గొట్టిముక్కల సాగరిక రావు, ఐఎన్టీయూసీ కూర వెంకట్, డీసీసీ, జనరల్ సెక్రెటరీ, డీసీసీ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కమిటీ కన్వీనర్, హనుమకొండ మారంరెడ్డి కౌటిల్ రెడ్డి, ఖుస్రూ పా, షా డాక్టర్ సెల్ అధ్యక్షులు శ్రవణ్, స్టేట్ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ ఛైర్మన్ గోవిందు శ్వేత, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కె.ఆర్. దిలీప్ రాజ్, మహిళా కాంగ్రెస్ చైర్మన్ బంక సరళ, సేవాదళ్ చైర్మన్ బొచ్చు చందర్, ఓబీసీ సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్, మైనారిటీ సెల్ చైర్మన్ మీర్జా అజీజ్ ఉల్లా బేగ్, ఆర్ జి పి ఆర్ ఎస్ ప్రెసిడెంట్ శనిగరం సుధాకర్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ అరూరి సాంబయ్య, ఎస్ యు ఐ ప్రెసిడెంట్ కాసుబోజుల వేణుచారి, మరియు అన్నీ మండలాల అధ్యక్షులు దూదిపాల బుచ్చి రెడ్డి, ముప్పు శ్రీనివాస్, పొచంపల్లి రాజి రెడ్డి, వాసాల శ్రీనివాస్, కొలపాక చేరాలు (చందు), ఒంటేరు శ్రవణ్ కుమార్, పర్నెం మల్లా రెడ్డి, రేవూరి జలేంధర్ రెడ్డి, దుబాసి రాజేందర్, మూరావత్ లక్ష్మణ్ నాయక్, పెసరు రమేష్, ఎన్. మోహన్ గౌడ్, ఆర్. అశోక్ మరియు అన్నీ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము గౌడ్, పుట్ట తిరుపతి, జక్కుల సదానందం, కర్ర హరీష్ రెడ్డి, వస్కుల శ్రీనివాస్, గడ్డం అరుణ్, కొంక హరి బాబు, దువ్వ శ్రీకాంత్, నేదునూరి సునీల్, గొర్రె కిరణ్, బొషబోయిన శ్రీధర్ యాదవ్, సోమ కరుణ శ్రీ, మహమ్మద్ అజామ్, పోలు లక్ష్మీ నారాయణ, సీత శ్యామ్, భీమ వినయ్, ఫిరోజ్ ఖాన్, ఎండి.సమద్, బొమ్మ సురేష్, తోట రాజ్ కుమార్, సత్తు రమేష్, దొంగల కుమార్, గొపనబోయిన చందు, నాగపురి కరన్, ఎండి.బషీర్, ఎండి.కరీం, తడుక సుమన్, యర్ర మహేందర్, దొనికెన సుమన్, ఎక్కటి అశోక్ రెడ్డి, తాళ్లపల్లి సుధాకర్, కేతిడి దీపక్ రెడ్డి, బుస్స నవీన్, అర్కవత్ లక్ష్మణ్ నాయక్, పాలడుగుల ఆంజనేయులు, సయ్యద్ విజయ శ్రీ రజాలి తో పాటు వివిధ విద్యార్థి, యువజన విభాగాలు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్ ఽ మండల అధ్యక్షులు, ఆర్‌జీపీఆర్ఎస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అడవి జంతువులను వేటాడి కొమ్ములు, మాంసం విక్రయం.. నిందితుడి అరెస్ట్

**- జింకలను వేటాడి మాంసం, కొమ్ములతో పాటు ఇతర భాగాలను విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడి**

**- వేటకు ఉపయోగించిన మోటార్ సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం**

**- గత సంవత్సరం ఆగస్టు 5వ తారీఖున కేసు నమోదు, అప్పటినుండి పరారీలో ఉన్న నిందితుడు, ప్రస్తుతం అరెస్ట్.**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర)అక్రమంగా అడవి జంతువులను వేటాడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు.ఆదిలాబాద్ పట్టణంలోని పంజేశా ప్రాంతానికి చెందిన షోయబ్ అఫ్జల్ (34) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. తన సంపాదన జల్సాలకు సరిపోవడం లేదని, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమంగా వన్యప్రాణులను వేటాడినట్లు పోలీసుల విచారణలో తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు 5న విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడు ఇంట్లో తనిఖీలు నిర్వహించగా, నిందితుడి ఇంట్లో ఉన్న డబుల్ బ్యారల్ తుపాకీ, కత్తులు, ఉలి కనిపించగా, అవి తన తాతలు గతంలో వేటకు ఉపయోగించినవని తెలిపాడు. అనంతరం తుపాకీతో వేటాడి అడవి జంతువుల మాంసం, కొమ్ములు మరియు ఇతర భాగాలను విక్రయించి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. నిందితుడు మహారాష్ట్రలోని ఘాటంజి అటవీ ప్రాంతానికి వెళ్లి జింకలను వేటాడినట్లు, వేటాడిన జింకలను అక్కడే కత్తులతో కోసి, మాంసాన్ని విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. జింకల కొమ్ములను హైదరాబాద్‌లో విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని భావించి, వాటిని ఇంట్లో దాచిపెట్టినట్లు తెలిపాడు. నిందితుడి ఇంట్లో జింకల కపాలాలతో కూడిన కొమ్ములు 6, ఒక జత జింక కొమ్ములు దాచినట్లు విచారణలో వెల్లడైంది. వేటకు వెళ్లే సమయంలో తనతో పాటు హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు కూడా వచ్చేవారని, అందరూ కలిసి వేటాడేవారని నిందితుడు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఇంతకుముందు పోలీసులు నిందితుడి ఇంట్లో సోదాలు నిర్వహించిన సమయంలో డబుల్ బ్యారల్ తుపాకీ, కత్తులు, జింక కొమ్ములు, జింక తలలతో కూడిన కపాలాలు, టార్చ్‌లైట్, నలుపు రంగు జాకెట్, మఫ్లర్, షూస్, బ్యాగ్ మరియు మూడు పెన్‌డ్రైవ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు తన కోసం గాలిస్తున్న విషయం తెలుసుకున్న నిందితుడు హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని ఔరంగాబాద్, ఆర్వి, పూణే ప్రాంతాల్లో తిరుగుతూ పోలీసులకు చిక్కకుండా ఉన్నట్లు విచారణలో వెల్లడించాడు. అనంతరం ఆదిలాబాద్‌కు వచ్చి ఇంటి వద్ద ఉన్న సమయంలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వేటకు ఉపయోగించిన మోటార్ సైకిల్ మరియు నిందితుడు ఉపయోగించిన సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణులను వేటాడటం, వాటి భాగాలను అక్రమంగా కలిగి ఉండటం లేదా విక్రయించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అక్రమ వేటకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కేసులో మరెవరైనా నిందితులు ఉన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు. నిందితుడి వివరాలు షోయబ్ అఫ్జల్ (34), గా/శీ అబ్దుల్ అజీజ్, వృత్తి: ప్లంబర్, రా. పంజేశా, ఆదిలాబాద్. ఈ కేసులో వన్ టౌన్ పోలీసుల బృందం సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసింది.

# రెండు నెలల్లో సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

**- మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వారి వారసులందరికీ ఉద్యోగాలివ్వాలి**

**- సింగరేణి లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలి**

**- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**- హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకులతో కలిసి సింగరేణి భవన్ ముట్టడి, ధర్నా**

హైదరాబాద్ అక్టోబర్05:( విజన్ ఆంధ్ర ) : రెండు నెలల్లోగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్ ఫిట్ చేయడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్, తెలంగాణ రక్షణ సేన నాయకులతో కలిసి సోమవారం లక్డీకాపూల్ లోని సింగరేణి భవన్ ను ముట్టడించారు. గంటకు పైగా నడి ఎండలో రోడ్డుపై బైఠాయించి కార్మికుల కోసం ఆందోళన చేపట్టారు. సింగరేణి యాజమాన్యం దిగివచ్చి తమతో చర్చలు జరిపే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ ఆందోళనతో సింగరేణి భవన్ ఎదుట పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సింగరేణి యాజమాన్యం తరపున అధికారులు బయటికి వచ్చి ఆందోళన చేస్తున్న కల్వకుంట్ల కవిత, హెచ్ఎంఎస్ నాయకులతో చర్చలు జరిపారు. సింగరేణి సీ అండ్ ఎండీ సెక్రటేరియట్ లో సమావేశంలో ఉన్నారని.. ఆయన ఆదేశాల మేరకు తాము చర్చలకు వచ్చామని తెలిపారు. సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కవిత స్పందిస్తూ సింగరేణి యాజమాన్యానికి రెండు నెలల సమయం ఇస్తున్నామని, అప్పటి వరకు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సింగరేణిలో మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్ ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు నెలల్లోగా ఈ ప్రక్రియ ప్రారంభం కావాలని.. లేదంటే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ గేటు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. దేశానికే వెలుగులిస్తున్న సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని యాజమాన్యం పట్టించుకోవటం లేదని విమర్శించారు. మూడు నెలల క్రితం తాము ఒత్తిడి తెస్తేనే మెడికల్ బోర్డు పెట్టారని.. కానీ మెడికల్ బోర్డుకు అప్లయ్ చేసుకున్న వారిలో 10 శాతం మందిని మాత్రమే అన్ ఫిట్ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత అన్ ఫిట్ కోసం అప్లయ్ చేసుకున్న వాళ్లందరినీ అన్ ఫిట్ చేసి వాళ్ల వారసులకు ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డిపెండెంట్ ఉద్యోగాలను ఇవ్వకుండా కార్మికులను ఇబ్బంది పెట్టే పనిచేస్తుందన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు మీరు వేసే బిచ్చం కాదు, అది కార్మికుల హక్కు అని చెప్పారు. సింగరేణి లాభాల్లో 35 శాతం కార్మికులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లతో ఉద్యోగాలు చేస్తున్న వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇలా వేధింపులకు గురి చేసి అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన వాళ్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. సింగరేణి బాగుంటేనే తెలంగాణ బాగుంటుందని.. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదన్నారు. అలాంటి సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ పోరాటం చేస్తుందన్నారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు బకాయిలు పెట్టటంతోనే సంస్థ ఇబ్బందుల్లో ఉందన్నారు. వెంటనే ఆ బకాయిలను చెల్లించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు.

***సింగరేణి ద్రోహుల చేతిలో ఉంది - రియాజ్ అహ్మద్***

సింగరేణి సంస్థ ద్రోహుల చేతిలో బందీ అయ్యిందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్ర




సంస్థగా ఉండాల్సిన సింగరేణిని మంత్రుల చేతిలో కీలుబొమ్మగా మార్చేశారన్నారు. ఇకనైనా యాజమాన్యం వైఖరిలో మార్పు రావాలని డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు సహా కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. కొత్త బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కాకుండా సింగరేణి ద్వారా నిర్వహించాలని.. నైనీ బ్లాక్ లో కూడా సింగరేణి నుంచి కార్మికులను నియమించాలన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా.**

**- ప్రజావాణికి 100 పిర్యాదుల స్వీకరణ**



మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 100 వినతులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత

**- అదనపు కలెక్టర్ భుజంగరావు**



నిజామాబాద్, అక్టోబర్ 05 :( విజన్ ఆంధ్ర) జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీ.ఎం ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అధికారులకు సూచించారు. వెంటదివెంట ఆర్జీలను పరిష్కరిస్తూ, వివరాలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 107 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు డీఆర్ఓ గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు.

***ఆర్.టీ.ఐ చట్టంపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు***

కాగా, సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో విస్తృత అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. ప్రజా వాణి అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 5 నుండి 12వ తేదీ వరకు ఆర్టీఐ వారోత్సవాలను అన్ని స్థాయిలలో నిర్వహిస్తూ, సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విస్డం పాఠశాల ప్రతిభకు గుర్తింపు.. ముగ్గురు ఉపాధ్యాయినిలకు జిల్లా అవార్డులు



వరంగల్ జిల్లాప్రతినిధి అక్టోబర్ 04(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లాలో పర్వతగిరి మండలంలోని విస్డం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయినిలు శ్రీలేఖ, గౌతమి, సునీతలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు. వరంగల్‌లోని నాని గార్డెన్‌లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మ), వరంగల్ డిస్ట్రిక్ట్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (వడుప్సా) ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, నర్సంపేట ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీలేఖ, గౌతమి, సునీతలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అవార్డులు పొందిన ఉపాధ్యాయినిలను పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్, డైరెక్టర్లు సుధాకర్, శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రావు, రాష్ట్ర కార్యదర్శి రమేష్ రావు , జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, భూపాల్ రావు , దండపంతుల రామ్మూర్తి , రాధ కృష్ణ, అశోక్, రాజు, దేవేందర్ , జిల్లా డిసిసిబి కార్యదర్శి కృష్ణమూర్తి వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్ జన్మదిన వేడుకలు

**- పాల్గొన్న మేడిపల్లి మండల ర్నలిస్టులు**



మేడ్చల్ జిల్లా/బోడుప్పల్, అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసంలో జరిగిన వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పొన్నం తరుణ్ గౌడ్‌కు పూలగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.పలువురు నాయకులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు.జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన నివాసం వద్ద సందడి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరుణ్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు,మేడిపల్లి ప్రెస్ క్లబ్ సలహాదారులు వి.సూర్యానారాయణ రెడ్డి,కోశాధికారి మరాటి మల్లేష్,ఉపాధ్యక్షుడు చింత రమేష్,కార్యవర్గ సభ్యుడు మరాటి మత్స్యగిరి,సోనీ పాల్గోన్నారు.

# సద్దుల బతుకమ్మ ఏర్పాట్లపై సమీక్ష



మందమర్రి, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర) : రాబోయే సద్దుల బతుకమ్మ ఏర్పాట్లపై ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఏర్పాట్లకు సంధించి అదేశాలు జారీ చేశారు. బెల్లంపల్లి, మందమర్రి, రామకృష్ణాపూర్ సింగరేణి మైదానలలో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే రామలీల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఉన్నత అధికారులు,ఉద్యోగులు,యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

**- పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట**

**- శాంపిల్స్ సేకరణ, రవాణాకు ప్రత్యేక వాహనం ప్రారంభం**

మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (విజన్ ఆంధ్ర): మూగజీవాల ఆరోగ్య పరిరక్షణతో పాటు పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పశువులకు సకాలంలో వ్యాధి నిర్ధారణ, చికిత్స అందించేందుకు ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల వ్యాధి నిర్ధారణ కోసం రక్తం, మూత్రం తదితర నమూనాల సేకరణ, సురక్షిత రవాణా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి యెన్నం శ్రీనివాస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

***వ్యాధి నిర్ధారణలో జాప్యానికి చెక్***

ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు అకస్మాత్తుగా వ్యాధులు సోకినప్పుడు వ్యాధి నిర్ధారణలో జాప్యం కారణంగా రైతులు నష్టపోతున్నారని అన్నారు. ప్రత్యేక వాహనం ద్వారా క్షేత్రస్థాయిలో పశువుల నుంచి నమూనాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి, అవి పాడవకుండా ప్రయోగశాలకు తరలించే అవకాశం కలుగుతుందని తెలిపారు.



***వేగవంతమైన పరీక్షలతో సకాలంలో చికిత్స***

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సేకరించిన శాంపిల్స్‌ను ప్రయోగశాలలో వేగంగా పరీక్షించి, ఫలితాలను వెంటనే సంబంధిత పశు వైద్యులకు చేరేలా సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పశువులకు సకాలంలో సరైన చికిత్స అందించడంతో పాటు అంటువ్యాధులు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

***రైతులు సేవలను సద్వినియోగం చేసుకోవాలి***

పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పశువుల ఆరోగ్యం మెరుగుపడితే పాడి రైతుల ఆర్థిక పరిస్థితి కూడా బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు శాంతన్న యాదవ్, పశుసంవర్ధక శాఖ అధికారులు, పశు వైద్యులు, ల్యాబ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో సిబ్బంది కొరతతో సతమతవుతున్న పోలీసులు,

## - ట్రాఫిక్ కు అంతరాయం, - రోడ్లపై నిత్యం ట్రాఫిక్ సమస్యలు

కల్వకుర్తి, అక్టోబర్ 4 (విజన్ ఆంధ్ర): నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో సిబ్బంది కొరతతో సతమతమవుతున్న పోలీస్ లు... దీంతో వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. లక్షన్నర జనాభా ఉన్న మండలానికి ఒక్క పోలీస్ స్టేషన్ మాత్రమే ఉండటం, అందులోనూ 60 మంది సిబ్బంది ఉండాల్సిన చోట తక్కువ మందితో నెట్టుకొస్తుండటంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. దీనికి తోడు ప్రధానంగా రోడ్లపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తలెత్తుతోంది.



**రోడ్లపైనే వాహనాలను నిలిపిన ఫైల్ ఫోటో...**

***నిబంధనల ప్రకారం 3 స్టేషన్లు ఉండాలి.. ఉన్నది ఒక్కటే:***

నిబంధనల ప్రకారం 50 వేల జనాభాకు ఒక పోలీస్ స్టేషన్ ఉండాలి. కల్వకుర్తి జనాభా 1 లక్ష 50 వేలు దాటింది. అంటే కనీసం 3 స్టేషన్లు అవసరం. కానీ ఉన్నది ఒక్కటే. దీంతో కేసుల విచారణ, రాత్రి గస్తీ, వీవీఐపీ బందోబస్తు వంటి విధులన్నీ తక్కువ స్టాఫ్ తోనే చేయాల్సి వచ్చి పోలీసులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దీని ప్రభావం నేరుగా పోలీస్ సేవలపై పడుతోంది.




***180 నుండి 500కి ఎగబాకిన క్రైమ్ గ్రాఫ్:***

గతంలో జనాభాకు తగ్గట్టుగా ఏడాదికి 180-200 క్రైమ్ కేసులు నమోదయ్యేవి. ఇప్పుడు జనాభా పెరగడంతో 500 వరకు కేసులు నమోదవుతున్నాయి. కల్వకుర్తి మీదుగా మూడు హైవేలు వెళ్లడం, వాహనాల రద్దీ పెరగడం, సిబ్బంది కొరత, కేసుల పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడం, ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజలతో మాట్లాడి చైతన్యం కల్పించకపోవడం క్రైమ్ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

***ట్రాఫిక్ సమస్యతో ప్రజల ఇబ్బందులు***

***- మంజూరైనా నేటికీ పనులు ప్రారంభం కాలేదు:***

ప్రస్తుతం కల్వకుర్తిలో ప్రధాన సమస్య రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం. పట్టణం మీదుగా మూడు హైవేలు వెళ్తుండటంతో రోజూ వందలాది వాహనాలతో ప్రధాన కూడళ్లు, బస్టాండ్,శివాజీ చౌక్, బొక్కలకుంట,మార్కెట్ యార్డ్ లలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీన్ని నియంత్రించడానికి ప్రభుత్వం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు.ఒకరిద్దరు ట్రాఫిక్ పోలీసులు తప్ప, పూర్తి స్థాయిలో ట్రాఫిక్ సిబ్బంది కొరత ఉంది. ఒక్క ట్రాఫిక్ పోలీసు కూడా లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

***ప్రజల డిమాండ్:***

పెరుగుతున్న జనాభా, క్రైమ్ రేటు దృష్ట్యా కల్వకుర్తి పోలీస్ స్టేషన్ ను టౌన్ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్ స్టేషన్ గా విభజించాలని, మంజూరైన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పనులను వెంటనే ప్రారంభించి ట్రాఫిక్ సిబ్బందిని ఎక్కువగా నియమించి రోడ్లపై ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

***అధికారుల వివరణ...***

పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు మా సిబ్బంది పర్యవేక్షణ సాగిస్తున్నారు. అయినా కూడా రోడ్లపై వాహనాలు నేర్పితే కచ్చితంగా జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటామని సీఐ బీమ్ కుమార్, ఎస్సై కురుమూర్తి అన్నారు...

# విజయ డైరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5,(విజన్ ఆంధ్ర ) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విజయ డైరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను సోమవారం హనుమకొండ జిల్లాలో ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి ముఖ్య అతిథులుగా హాజరై ఈ కేంద్రాలను ప్రారంభించారు.హనుమకొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో, అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డైరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తుల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను వారు పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డైరీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రజలకు, ముఖ్యంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి విజయ డైరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, వినియోగదారులకు సౌకర్యవంతమైన ప్రదేశాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా విజయ డైరీ ఉత్పత్తులకు మరింత ఆదరణ లభించే అవకాశం ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా విజయ డైరీ విక్రయ



కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో ఇటువంటి కేంద్రాల ఏర్పాటు ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తులను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి విజయ డైరీ సిబ్బందితో మాట్లాడి కేంద్రంలో అందుబాటులో ఉన్న పాల ఉత్పత్తులు, వాటి విక్రయ విధానం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా అవసరమైన ప్రమాణాలను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు వేము ల శ్రీనివాస్, నాయకులు తోట పవన్, నలుబోల సతీష్, విజయ డైరీ డీడీ ధనరాజ్.అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ అధికారులమంటూ సైబర్ మోసాలు.. నిందితుడి అరెస్ట్

**- ఆదిలాబాద్ బాధితుని వద్ద రూ.73,279 మోసం**

**- మహారాష్ట్ర గోవా తెలంగాణ రాష్ట్రాలలో దాదాపు 150 ఫిర్యాదులు నమోదు.**

**- మూడు రాష్ట్రాల బాధితుల వద్ద 95 లక్షల వరకు మోసం**

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 5(విజన్ ఆంధ్ర )మహారాష్ట్రలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఆదిలాబాద్ 1 టౌన్ పోలీసులు నిందితుడి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నిందితుడి వివరాలు చైతన్య ప్రమోద్ కుటె (25), నా/శీ ప్రమోద్ కుటె, డబ్కి రోడ్డు, గురుకృప ప్రొవిజన్ సమీపంలో, మెహరేనగర్, ఖరద్ పోస్ట్, అకోలా గ్రామీణ, అకోలా జిల్లా, మహారాష్ట్ర. (ప్రస్తుతం పింప్రి-చించ్వాడ్, పూణే, మహారాష్ట్ర. బ్యాంక్ అధికారులమంటూ ప్రజలకు ఫోన్ చేసి, వారి క్రెడిట్ కార్డులు, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలు మరియు ఓ టీ పి లు సేకరించి డబ్బులు కాజేస్తున్న సైబర్ నేరస్థుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పత్రిక సమావేశంలో వివరాలను వెల్లడించారు.. ఆదిలాబాద్ బ్రాహ్మణవాడకు చెందిన బాధితుడు ప్రఫుల్ పాటిల్కు 2026 జూలై నెలలో బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి, అతని క్రెడిట్ కార్డును యాక్టివేట్ చేస్తామని నమ్మించి సైబర్ మోసానికి పాల్పడి రూ.73,279/- కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబరు 633/2026 నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా ఎన్ సి అర్ పి




పోర్టల్ ద్వారా లభించిన సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. పై అధికారుల ఆదేశాల మేరకు ఆదిలాబాద్ 1 టౌన్ ఆధ్వర్యంలోని పోలీసు బృందం మహారాష్ట్రకు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆదిలాబాద్‌కు తీసుకువచ్చింది. పోలీసుల విచారణలో నిందితుడు తాను గతంలో ఎక్స్‌ప్రెస్ బ్యాంక్‌లో పనిచేసిన సమయంలో కస్టమర్లతో మాట్లాడిన అనుభవాన్ని ఉపయోగించుకుని, బ్యాంక్ కస్టమర్లకు సంబంధించిన మొబైల్ నంబర్లను సేకరించినట్లు తెలిపాడు. అనంతరం వివిధ సిమ్ కార్డులు, మొబైల్ ఫోన్లు ఉపయోగిస్తూ బ్యాంక్ అధికారులమంటూ కస్టమర్లకు ఫోన్ చేసి, వారి క్రెడిట్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు మరియు ఓ టీ పి లను తెలుసుకుని డబ్బులను వివిధ యు పి ఐ అమెజాన్ ఖాతాలకు బదిలీ చేసుకున్నట్లు తెలిపాడు. నిందితడు తెలంగాణ, మహారాష్ట్ర మరియు గోవా రాష్ట్రాలలో దాదాపు 150 మంది బాధితుల వద్ద రూ 95,33,651/- నగదు నష్టపోయినట్లు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ నందు ఫిర్యాదులను నమోదు అయినట్లు తెలిపారు. అదేవిధంగా 23.07.2026న బాధితుడికి హెచ్ డీ ఫ్ సిబ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి, క్రెడిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో నమ్మించి, ఓ టీ పి లను తెలుసుకుని ఐదు లావాదేవీల ద్వారా మొత్తం రూ.73,279/- బదిలీ చేసుకున్నట్లు విచారణలో తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు మోసాలకు ఉపయోగించినట్లు తెలిపిన మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసినట్లు కూడా విచారణలో వెల్లడించాడు. అలాగే వివిధ మొబైల్ నంబర్లతో సిమ్ కార్డులు మార్చుతూ, మొబైల్ ఫోన్లు మార్చుతూ సైబర్ మోసాలకు పాల్పడినట్లు తెలిపాడు. నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నవి ఒక కారు ఐ ఫోన్ చెయండి 13 మొబైల్ ఫోన్ వివిధ సిమ్ కార్డులు నిందితుడిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పీ గారు తెలిపారు. ప్రజలు బ్యాంక్ అధికారులు, పోలీసు అధికారులు లేదా ఇతర సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ టీ పి, పిన్, సి వి వి, క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు. కేసు నందు కీలకంగా వ్యవహరించిన సిబ్బంది ప్రతి ఒక్కరికి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా నగదు రివార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం నందు ఆదిలాబాద్ డిఎస్పి ఎల్జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ 1 టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, ఎస్ఐ లు గోపికృష్ణ, అశోక్, మరియు పోలీసు సిబ్బంది, సైబర్ క్రైమ్ కీలకంగా వ్యవహరించారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఆర్డీఎఫ్ జూనియర్ కళాశాల విద్యార్థిని



వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 04(విజన్ ఆంధ్ర); హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన లిలి20వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్--2026 లో భాగంగా జరిగిన వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామంలోని ఆర్డిఎఫ్--వనిత అచ్యుత పాయి జూనియర్ కళాశాల, కల్లెడకు చెందిన విద్యార్థిని జీ. చందన ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆడేపు జనార్ధన్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని: 1. జీ. చందన -- బైపీసీ, ప్రథమ సంవత్సరం విభాగం: 60 మీటర్ల పరుగు స్థానం: 3వ స్థానం ఈ సందర్భంగా విద్యార్థిని G. చందనను కళాశాల ప్రిన్సిపాల్ ఆడేపు జనార్ధన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఏ.ఓ. సతీష్, అధ్యాపకులు సంతోష్, జయశంకర్, సైదులు, మహేష్, ధాన్య, కిషన్, వేణు, శ్రీలత, గుంశావళి, ధనలక్ష్మి, ప్రవీణ్, తిరుమల, మహేష్ మరియు ఫిజికల్ డైరెక్టర్ బర్ల రాజు అభినందించారు.అనంతరం రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా చందన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# సామ రామ్మోహన్‌రెడ్డికి కొత్త సుశాంత్‌గౌడ్ అభినందనలు

**- శాలువాతో సన్మానించిన యూత్ కాంగ్రెస్ నాయకులు**



మేడ్చల్ జిల్లా/బోడుప్పల్,అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అవకాశం పొందిన సామ రామ్మోహన్‌రెడ్డిని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు కొత్త సుశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం లభించినందుకు శుభాకాంక్షలు తెలిపిన యువజన కాంగ్రెస్ నాయకులు.. రాబోయే ఎన్నికల్లో సామ రామ్మోహన్‌రెడ్డి ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆయన విజయానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కొత్త సుశాంత్‌గౌడ్ మాట్లాడుతూ..సామ రామ్మోహన్‌రెడ్డి విజయానికి ఐక్యంగా కృషి చేస్తాం. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత ముందుండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు సాయి కిరణ్‌రెడ్డి, రుకువర్ధన్‌రెడ్డి, గణేష్ నాయక్, బొక్క సత్తిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, వినోద్, శ్రావణ్ నాయక్, ఓం ప్రకాష్, సాయి గౌడ్, ఉమేష్ చారి, అర్జున్‌రెడ్డి, ఇంతియాజ్, సంతోష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, కట్ట జగన్ తదితరులు పాల్గొన్నారు.

## కొరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో చలో ఉస్మానియా..!

***- ఎమ్మెస్ఎఫ్ యుద్ధభేరికి ఉప్పల్ విద్యార్థులు కదిలిరావాలి..!***



కాప్రా /అక్టోబర్ 05 ( విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉప్పల్ ఇన్‌చార్జి కొరపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న ఎమ్మెస్ఎఫ్ యుద్ధభేరి కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గంలోని విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు గంగా ప్రణయ్, ఉప్పల్ అధ్యక్షుడు క్రాంతి కిరణ్, చిల్కానగర్ అధ్యక్షుడు బాలరాజ్, మల్లాపూర్ అధ్యక్షుడు కొల్లూరి రవి, సంతోష్ కుమార్, ఉప్పల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు యోగేష్, కొరపాక రమేష్ తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కమీషన్ గ్యాప్...
# న్యాయానికి స్టాప్!!

- పదవీకాలం ముగిసింది... భరోసా ముగుస్తుందా?
- ఆర్జీల గుట్టలు... సమాధానం ఎవరిది?
- తక్షణ పొడిగింపే పరిష్కారం
- కొత్త కమిషన్... వెంటనే కావాలి
- 85.86 లక్షల బలం... భరోసా మాత్రం బలహీనం?




*హైదరాబాద్ (పల్స్ డెస్క్ ), అక్టోబర్ 5:* చేతిలో చిల్లిగవ్వ లేకున్నా ఊళ్లో అప్పుచేసి బస్సెక్కి వస్తారు. "నా భూమి గుంజుకున్నరు సారూ...", "కులంపేరిట ఊరినుంచి వెలివేసిన్రు సారూ..." అంటూ కన్నీళ్లతో కాగితం చేతబట్టి రాజధాని గడప తొక్కుతారు. రాష్ట్రంలో 90 లక్షల మంది దళిత, గిరిజన బిడ్డలకు ఆఖరి న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ కమిషన్. ఇప్పుడు సరిగ్గా ఆ గుమ్మం దగ్గరే పెద్ద ప్రశ్నార్థకం వేలాడుతోంది. మూడేళ్ల పదవీకాలం ముగిసింది. కుర్చీలు ఖాళీ అవుతున్నాయి. పాలకుల వద్ద ఫైళ్లు కదులుతాయో లేదో తెలీదు కానీ... బాధిత గుండెల్లో మాత్రం భయం మొదలైంది.




**చైర్మన్ లేని చాంబర్... దిక్కుతోచని ఆర్జీల అంబార్!**

కమిషన్ అంటే కేవలం ఒక ఆఫీస్ కాదు... అది ఒక చట్టబద్ధమైన కవచం. ఎక్కడ దౌర్జన్యం జరిగినా కలెక్టర్లకు, ఎస్పీలకు సమన్లు జారీచేసి బాధితుల పక్షాన నిలబడే ఏకైక వేదిక. ఇప్పుడు కమిషన్‌కు "గ్యాప్" వస్తే జరిగేది ఇదే:

**ఆగిన సుమోటో పవర్స్**

అట్రాసిటీ కేసుల్లో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే నిలదీసే అధికారం పాలకమండలి లేకపోతే స్తంభించిపోతుంది.

**గుట్టలుగా మారే ఫైళ్లు**

రోజూ పదుల సంఖ్యలో వచ్చే పిటిషన్లు పరిష్కారం దొరక్క అటకెక్కిపోతాయి.

బలహీనుడిపై మరింత బలప్రయోగం "కమిషన్‌లో అడిగేటోడే లేడు" అనే ధైర్యంతో క్షేత్రస్థాయిలో పెత్తందార్ల ఆగడాలు, దౌర్జన్యాల ట్యాప్ పూర్తిగా తెరుచుకుంటుంది.

**బైఫర్కేషన్ లెక్కలు సరే... బాధితుల మాటేమిటి?**

ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేరు చేయాలన్న డిమాండ్ సమంజసమే కావచ్చు. కానీ చట్టసవరణలు, కొత్త రూల్స్, కార్యాలయాలు, నిధుల కేటాయింపు పేరుతో నెలల తరబడి ఫైళ్లను టేబుళ్ల చుట్టూ తిప్పితే... ఆ మధ్యకాలంలో జరిగే అన్యాయాలకు బాధ్యులెవరు?. బాధితుడి కన్నీటికి వెయిటింగ్ లిస్ట్ ఉండదు. పాలనాపరమైన సంస్కరణలు నెరవేరేవరకు వ్యవస్థను నిర్వీర్యం చేయడం న్యాయం అనిపించుకోదు.

**సర్కార్ ముందున్న తక్షణ మార్గం**

**నో గ్యాప్ పాలసీ**

కొత్త బాడీ లేదా బైఫర్కేషన్ ప్రక్రియ పూర్తయ్యే దాకా ప్రస్తుతం ఉన్న పాలకవర్గానికి కనీసం 3 నుంచి 6 నెలల తాత్కాలిక పొడిగింపు ఇవ్వాలి.

**యుద్ధప్రాతిపదికన నిర్ణయం**

పొడిగింపు కాదనుకుంటే, ఒక్క రోజు కూడా విరామం రాకుండా తక్షణమే పూర్తిస్థాయి కొత్త కమిషన్‌ను నోటిఫై చేయాలి.

**న్యాయం ఆగకూడదు**

చైర్మన్ లేకపోయినా ప్రత్యేక అధికారి ద్వారా అత్యవసర విచారణలు జరిగేలా అధికారిక మెకానిజం తేవాలి.

కమీషన్‌లో ఒక్కరోజు "గ్యాప్" వచ్చినా... అణగారిన వర్గాల సమస్యల "ట్యాప్" లీకై వరదలా మారుతుంది. ప్రజా ప్రభుత్వం తక్షణమే స్పందించి దళిత, గిరిజనుల ఆత్మగౌరవానికి రక్షణ కవచం నిలబెట్టాలి.

**- గడ్డం సంతోష్ రాజ్**

స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర

# రాజకీయంగా ఎదుగుతున్నామని ఓర్వలేక కుట్ర

- తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను
- మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మసాని సువర్ణ



వరంగల్ జిల్లాప్రతినిధి అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర); ఆధారాలు లేకుండా దళిత ఎమ్మెల్యే వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలు సాగనివ్వము.లివర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజులి పై ఎన్ టివి ఛానల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా వాస్తవాలను నిర్ధారించకుండా తప్పుడు వార్తలను ప్రసారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఒక దళిత ఎమ్మెల్యే పై ఇలాంటి అసత్య కథనాలను వెలువరించడం సిగ్గుచేటు చేటు. ఈ నియోజకవర్గాన్ని 30 సంవత్సరాలుగా పాలించిన అగ్రవర్ణాలు ఏమాత్రం అభివృద్ధి చేయలేదు 563 జాతీయ రహదారిపై ఉన్న నియోజకవర్గాలలో ఒకటి వర్ధన్నపేట నియోజకవర్గం.గతంలో వున్న ధళిత ఎమ్మెల్యే గారు దొరలా పక్కన చెరి తాను అభివృద్ధి చెందినాడుతప్ప నియోజకవర్గాన్ని అభివృధి చేయలేధు. దళిత ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు గారు వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఒక కమిట్మెంట్ తో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారు 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,సబ్ డివిజనల్ కోర్టు, సబ్ జైలు, క్రీడా మైదానం లాంటి శాశ్వతమైన పనులను అసెంబ్లీలో మాట్లాడి మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు గారికే దక్కుతుంది.అయితే ఈ నియోజకవర్గంలోని ప్రతిపక్షాలు మరియు ప్రతిపక్షాలకు తోడు అగ్రవర్ణ నాయకుడు కొంతమంది గిరిజన నాయకులను వెంటవేసుకొని ఒక దళిత ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు గారినీ బలహిన పరిచేలా చుస్తున్నారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ పోతే రేపు జనరల్ స్థానంలో కూడా ఎమ్మెల్యేగా ఉంటాడు తానే గెలుస్తాడు అనే కోణంలో అతిపెద్ద కుట్రకు అగ్రవర్ణాల వారు వారి రాజకీయ భవిష్యత్తు కోసం దళిత ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు గారి పై అసత్య ప్రచారాలకు ఎన్ టివి వారితో కుమ్మక్కై కుట్ర చేస్తున్నారు. నాగరాజు అనే వ్యక్తి అగ్రవర్ణాలకు ఏ మాత్రం ఛాన్స్ ఇవ్వకుండా అభివృద్ధిని చేసుకపోతున్నారు. గతంలో వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా పని చేసిన అగ్రవర్ణాల వారు మరియు గతంలో పనిచేసిన దళిత ఎమ్మెల్యే 15 నుండి 20 లక్షలు వసూలు చేసేవారు మార్కెట్ చైర్మన్ లాంటి వగైరా నామినేటెడ్ పదవులను అమ్ముకునేవారు.కానీ ఈ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీలు ఆయన అయినవోలు దేవాలయ చైర్మన్ పదవులను రూపాయి ఇచ్చుకోలేని వారికే ఇవ్వడం జరిగింది. ఇక పార్టీ పదవులు తెలంగాణ రాష్ట్ర ఒక్క ఎమ్మెల్యే గాని, మంత్రి గాని మహిళను మండలాధ్యక్షులు చేయలేదు. కాని ఒక్క వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు గారు పర్వతగిరి మండల పార్టీ అధ్యక్షురాలు సావిత్రమ్మ ఎస్టీ సామాజిక వర్గం నుండి మండల అధ్య క్షురాలు చేసారు ఇచ్చారు. లిఇదే కే ఆర్ మార్కంటే.. లిపిఎసిఎస్ చైర్మన్ గాని డైరెక్టర్ల పదవులను గాని బై బర్త్ నుండి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడి పార్టీ లైన్లో పనిచేసిన సీనియర్ కార్యకర్తలను గుర్తించి రాజకీయ సమీకరణల దృష్ట్యా వారి సీనియార్టీ ఆధారంగా వర్ధన్నపేట నుండి అబ్బిడి రాజిరెడ్డి, పర్వతగిరి నుండి పిన్నింటి అనిల్ రావు, చౌటపెల్లి నుండి అతి కుమారస్వామి మరియు పింగిలి వెంకట్ రామ్ నర్సింహారెడ్డి లాంటి అత్యంత సీనియర్ కార్యకర్తలకే ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు గారు నామినేటెడ్ పదవులు ఇచ్చారు. గతంలో ఏలిన దళిత అగ్రవర్ణాల నాయకుల లాగ ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. ఒకసారి పదవులు పొందిన వారి పోస్టులు, పొందిన వారి గురించి వారి యొక్క సీనియార్టీ ఉన్నవారు నిజాలు తెలుసుకొని వార్తలు రాస్తే మంచిదని సూచిస్తున్నాం. కొందరు అగ్రవర్ణాల కుట్రలో మీడియా భాగస్వామ్యం కావద్దు అని కోరుకుంటున్నాం ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు పై కుట్రలు చేస్తున్న అగ్రవర్ణ నాయకుల్లారా తస్మాత్ జాగ్రత్త.

## ఈ నెల 7న నిజామాబాద్ కు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ రాక

- బహిష్కరణ ఘటనలపై బాధితులతో భేటీ కానున్న చైర్మన్, సభ్యులు
- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి



నిజామాబాద్, అక్టోబర్05: (విజన్ ఆంధ్ర) జిల్లాలోని పలు ప్రాంతాలలో చోటు చేసుకుంటున్న సామాజిక బహిష్కరణ ఘటనలపై బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఈ నెల 7న నిజామాబాద్ పర్యటనకు విచ్చేయనుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డా. బాల లక్ష్మీలు సాంఘిక బహిష్కరణకు గురైన బాధితులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకోనున్నారని అన్నారు. ఈ నెల 7న నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బాధితులతో కమిషన్ ప్రతినిధులు ఫిర్యాదులను స్వీకరిస్తారని తెలిపారు. బాధితులు కమిషన్ చైర్మన్, సభ్యులను నేరుగా కలిసి విజ్ఞాపనలు, ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు.

## తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ స్టేట్ నూతన కమిటీ ఎన్నిక

**వరంగల్ ఉమ్మడి జిల్లాకు దక్కిన ప్రాధాన్యం**



వరంగల్ జిల్లాప్రతినిధి అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర); ఆదివారం రోజున 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శి ఆధ్వర్యంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మరోసారి మామిడిపల్లి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది... మామిడిపల్లి కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్రాల సమస్యలపై ఎల్లవేళలా పోడదామని.. సాధించేంతవరకు కృషి చేస్తానని చెప్పినారు... తెలంగాణ రాజీవ్ ఆరోగ్యశ్రీ స్టేట్ కమిటీ ఈసీ మెంబర్ గా నల్లబెల్లి అనిల్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.. ఎన్నుకున్నందుగాను రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదన్న కి.. గౌరవ అధ్యక్షులు భూపాల్ అన్న కి. స్టేట్ కమిటీ లో ఉన్న అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినారు.. వరంగల్ ఉమ్మడి జిల్లా నుండి రవీందర్ ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా ఎన్నుకోవడం జరిగింది.. అలానే తాళ్లపల్లి పావని ని రాష్ట్ర సహాయ కార్యదర్శి గా ఎన్నుకోవడం జరిగింది .. వరంగల్ ఉమ్మడి జిల్లా తరఫున గిరి యాదన్న కి స్టేట్ కమిటీ లో వివిధ పదవుల్లో ఉన్న అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## !!.విజన్ ఆంధ్ర ఎఫెక్ట్.!!

# ప్రారంభమైన అంగన్‌వాడీ కేంద్రం పనులు

- విజన్ ఆంధ్ర కథనానికి స్పందించిన అనంతపల్లి సర్పంచ్


విజన్ ఆంధ్ర
25 Sep 2026 - Page 3
epaper.visionandhra.in
నిలిచిపోయిన నూతన అంగన్‌వాడీ నిర్మాణ పనులు: అనంతపల్లి.
అసంపూర్తిగా అంగన్ వాడి నిర్మాణం..
చిన్నారులకు ఇబ్బందులు
బోయినిపల్లి సెప్టెంబర్ 24 (విజన్ ఆంధ్ర):



అంగన్వాడీ భవనం పనులను ప్రారంభించిన అనంతపల్లి గ్రామ సర్పంచ్ గంగాధర కావ్య -లక్ష్మణ్

బోయినిపల్లి, అక్టోబర్ 05 (విజన్ ఆంధ్ర) : బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామంలో నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోవడంతో.. "నిలిచిపోయిన అంగన్ వాడి నిర్మాణం పనులు" అనే కథనం "విజన్ ఆంధ్ర" లో సెప్టెంబర్ 24 న ప్రచురితం కాగా.. సోమవారం తిరిగి నూతన అంగన్వాడి కేంద్రం పనులను సర్పంచ్ గంగాధర కావ్య- లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మధ్యలో కాంట్రాక్టర్ పనులు చేయకపోవడం వల్ల జాప్యం జరిగిందని అన్నారు. సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్టర్ గ్రామ నాయకుల సమన్వయంతో నూతన అంగన్వాడి భవనం అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

చిన్నారులకు అవసరమైన అన్నివసతులతో కూడిన అంగన్ వాడి నూతన భవనం నిర్మిస్తామని, గ్రామ ప్రజల కోరిక మేరకు అంగన్వాడి నిర్మాణం చేపట్టామని, ఎలాంటి ఆందోళన చందవద్దని కోరారు. అంగన్వాడి భవన నిర్మాణ పనుల విషయమై సర్పంచ్ గంగాధర కావ్య-లక్ష్మణ్ ప్రభుత్వానికి తెలుపగా అధికారులు స్పందించి నూతన అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించుటకు సహకరించారని మరియు నాణ్యతతో అంగన్ వాడి పనులు త్వరితగతిన పూర్తి చేసి, చిన్నారులకు అన్ని వసతులతో కూడిన, నూతన అంగన్ వాడి కేంద్రం ను అందుబాటులోకి తీసుకు వస్తానని అన్నారు. అంగన్ వాడి సిబ్బంది, గ్రామస్తులు సహకరించాలని గంగాధర కావ్య-లక్ష్మణ్ కోరారు. అనంత పల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, సర్పంచ్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

## పత్తి కొనుగోళ్లకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు



మెదక్ అక్టోబర్ 5, విజన్ ఆంధ్ర : మెదక్ పత్తి కొనుగోళ్లపై సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో వ్యాపారులు సీసీఐ వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, ఫైర్,లీగల్ మెట్రాలజీ శాఖల అధి కారులతో సన్నాహక సమావేశం అదనపు కలెక్టర్ నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిన్నింగ్ మిల్లుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, రైతులను సంబంధిత మిల్లులకు ట్యాగింగ్ చేసే ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, తూకం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. మాయిశ్చర్ మీటర్లను సక్రమంగా వినియోగించేలా ఏ ఈ ఓ లు, గ్రేడర్లు, సీసీఐ సిబ్బందికి ప్రత్యేక శిక్షణనందించాలని సూచించా రు. ప్రతీకొనుగోలు కేంద్రంలో హెల్ప్‌డెస్క్ ఏర్పా టు చేయాలన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ కనీస మద్దతు ధర 8,667 ప్రకటించిన జరిగిందని మెదక్ జిల్లాలో 39వేల 940 ఎకరాల పత్తి సాగు చేశారని,03 లక్షల 95,280 క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉందని అదే మారుగా ఏ ఈ ఓ లు రైతుల నుంచి గుర్తించిన వారికి కాపాస్ కిసాన్ యాప్ లో వారి పంట వివరాలను పొందుపరచాలని ఆ తర్వాత రైతులు ఏ రోజు అయితే స్లాట్ బుక్ చేసుకుంటారో అదే రోజు పత్తి అమ్మకానికి తీసుకొచ్చే విధంగా చూడాలని వ్యవసాయ అధికారినీ ఆదేశించారు. తూనికల కొలతల అధికారులు వే బ్రిడ్జి మరియు వేయింగ్ స్కేల్ తూకంలో వ్యత్యాసాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో జిన్నింగ్ మిల్ మరియు గోదాముల వద్ద నీటి వసతులు ఉన్నాయా , లేదా మరియు ఫైర్ పరికరాలు తనిఖీ చేయాలనే ఆదేశించారు రైతులు తమ పంటను పత్తి మార్కెట్ యార్డు మరియు జిన్నింగ్ మిల్స్ కు వచ్చినప్పుడు తేమ శాతం లేకుండా ఆరబెట్టుకుని ట్రాక్టర్లలో గాని డీసీఎంలలో గాని లేదా లారీలలో గాని పత్తిని తీసుకొని వచ్చేటప్పుడు నిబంధనలు పాటించి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని తెలిపారు. సమావేశంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,మార్కెటింగ్ అధికారి బాలరాజు, తునికల కొలతల శాఖల అధికారి , అగ్నిమాపక శాఖ అధికారి వేణు, డీఎస్పీ ప్రసన్నకుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ నిషేధిత భూ సమస్యలపై సత్వరమే స్పందించాలి

- అర్హులైన వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి
- రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదు
- వారం రోజుల్లోపు అన్ని దరఖాస్తులను పరిష్కరించాలి
- రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ సలహాదారు, రూరల్ ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష




నిజామాబాద్, అక్టోబర్ 05 :( విజన్ ఆంధ్ర ) 22-ఏ నిషేధిత భూములకు సంబంధించి ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, అర్జీలపై సత్వరమే స్పందించాలని ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రెవెన్యూ అధికారులు, అన్ని మండలాల తహసిల్దార్లతో రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 22-ఏ నిషేధిత భూములకు సంబంధించి దరఖాస్తుదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదని అన్నారు. భూభారతి చట్టం మార్గదర్శకాలను పాటిస్తూ, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని హితవు పలికారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులు ఇబ్బందులు పడకూడదని, అర్హులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అన్ని దరఖాస్తులను వారం పది రోజుల్లోపు పరిష్కరించాలని స్పష్టమైన గడువు విధించారు. ఇదే తరహాలో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం విషయంలోనూ జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువుల శిఖం భూముల కబ్జాలను ఉపేక్షించకూడదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. అవసరమైన చోట పకడ్బందీగా సర్వే నిర్వహించి, హద్దులను నిర్ధారిస్తూ ప్రభుత్వ భూములు, శిఖం భూములను పరిరక్షించాలని సూచించారు. రెవెన్యూ, అటవీ భూవివాదాల పరిష్కారానికి త్వరలోనే జాయింట్ సర్వే జరిపిస్తామని అన్నారు. కాగా, ఇసుక రవాణా నిబంధనలకు అనుగుణంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం 5.00 గంటల తరువాత ఇసుక రవాణా చేస్తూ వాహనాలు తిరుగకూడదని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన ధాన్యం సేకరణ కోసం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం రవాణాకు వాహనాల కొరత ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. కాగా, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే నిజామాబాద్, బోధన్ పట్టణాలలో వారికి రెండు పడక గదుల ఇళ్లను కేటాయించడం జరిగిందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, అన్ని మండలాల తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

# ప్రాణాలు పోయినా ఇక్కడే ఉంటా..

- పెళ్లి చేసి పంపించండి అంటూ యువతి ఆవేదన
- ప్రియుడి ఇంటి ముందు యువతి మౌన పోరాటం
- మూడేళ్లు ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ ఆరోపణ
- వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ ఇంటి ముందు ఉద్రిక్తత..





వరంగల్ జిల్లాప్రతినిధి అక్టోబర్ 05(విజన్ ఆంధ్ర); ప్రియుడు వచ్చి తనను పెళ్లి చేసుకునే వరకు ఇంటి ముందు నుంచి కదిలేది లేదంటూ ఓ యువతి టెంట్ వేసి మౌన పోరాటానికి దిగింది. వర్ధన్నపేటలో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. బాధితురాలు తుమ్మల శ్రీదేవి తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు శ్రీకాంత్ 3 ఏళ్లుగా తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లొంగదీసుకున్నాడని ఆరోపించింది. ఇటీవల పెళ్లి విషయమై నిలదీయగా నిరాకరిస్తూ మొహం చాటేశాడని, పెద్దలను ఆశ్రయించినా సరైన సమాధానం ఇవ్వలేదని పేర్కొంది. రాజకీయ అధికార బలంతో తనను, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. శ్రీకాంత్ వచ్చి పెళ్లి చేసుకునే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేసింది. న్యాయం జరగకపోతే ప్రాణాలు తీసుకుంటానంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.